teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 227 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | బుధవారం | 18 డిసెంబర్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## శాసనసభ నేటికీ వాయిదా

స్వల్పకాలిక చర్చ అనంతరం సభ వాయిదా.. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటన



02



### డయల్ 100, 108, 101' స్థానంలో

# ఇంటిగ్రేటెడ్ కమాండ్

కంట్రోల్ సెంటర్ కేంద్రంగా ఆపరేషన్స్

త్వరలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరణ

ఏర్పాట్లు పూర్తి చేసిన సిటీ పోలీసులు




డయల్ 100, 108, 101. రానున్న రోజుల్లో కనుమరుగు కాబోతున్నాయి. వాటి స్థానంలో రాష్ట్రవ్యాప్తంగా 'డయల్112' సేవలు అందుబాటులోకి రానున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు, బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు ఇకపై ఒకే నంబర్ వినియోగంలోకి రానున్నది.

తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): టీజీ పేరుతో ప్రత్యేక లోగోను కూడా అధికారులు సిద్ధం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా త్వరలోనే 'డయల్ 112' సేవలను అందుబాటులోకి తేనున్నారు. ఇందుకు సంబంధించి సిటీ పోలీసులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ కేంద్రంగా ఈ

మిగతా 2 లో

## హైడ్రా ఏర్పడక ముందు ఉన్న నిర్మాణాల జోలికి వెళ్ళం

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్లారిటీ



హైదరాబాద్, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): హైడ్రా ఏర్పడకముందు ఉన్న నిర్మాణాల జోలికి వెళ్లమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్లారిటీ ఇచ్చారు. ఇవాళ హైడ్రా బృందం మూసాపేట ప్రాంతంలోని కాముని చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ రంగనాథ్ మీడియాతో మాట్లాడుతూ కూల్చివేతలపై హైడ్రా మీద చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఖండించారు. హైడ్రా ఏర్పడకముందు ఉన్న నిర్మాణాల జోలికి వెళ్లమని, జూలై తర్వాత కడుతున్న అక్రమ నిర్మాణాలను తప్పక కూల్చివేస్తామని స్పష్టం

మిగతా 2 లో




## స్థానిక సంస్థల ఎన్నికల్లో మారనున్న రిజర్వేషన్లు

ఇద్దరి కన్నా ఎక్కువ మంది పిల్లలు ఉన్నా అవకాశం

ప్రతి మండలానికీ కనీసం ఐదు ఎంపీటీసీ స్థానాలు

సర్పంచ్‌లను తొలగించేందుకు కలెక్టర్లకు మరిన్ని పవర్స్

తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఐదేండ్లకోసారి రిజర్వేషన్లు మారనున్నాయి. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, జడ్పీ చైర్మన్ల రిజర్వేషన్లు ప్రస్తుత ఎన్నికల్లో చేంజ్ కానున్నాయి. రిజర్వేషన్లు వరుసగా రెండు సార్లు కాకుండా ఒకే సారి ఉండే విధంగా పంచాయతీరాజ్‌చట్టం 2018లో




మిగతా 2 లో




## స్థానికతపై ఎంబీబీఎస్, బీడీఎస్ విద్యార్థులకు హైకోర్టులో ఊరట

ఇతర రాష్ట్రాల్లో చదివిన విద్యార్థులను స్థానికంగా పరిగణించాలి

తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో స్థానికతపై ఎంబీబీఎస్, బీడీఎస్ విద్యార్థులకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. ఇతర రాష్ట్రాల్లో చదివిన రాష్ట్ర విద్యార్థులను స్థానికంగా పరిగణించాలని ఉన్నత న్యాయస్థానం వెల్లడించింది. ఈ మేరకు జీవో 140 సవరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. జీవో 140 ప్రకారం 6వ తరగతి నుంచి 12వ తరగతి

మిగతా 2 లో



## నమూనా చీరలను పరిశీలించిన సీఎం, మంత్రులు

63లక్షల మహిళా సంఘాలకు యూనిఫాం ఏర్పాట్లు

హైదరాబాద్, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): స్వయం సహాయక సంఘాల మహిళలకు అందించేందుకు ఎంపిక చేసిన నమూనా చీరలను సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పరిశీలించారు. సీఎం చాంబర్ లో సీఎంతో పాటు మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు,

మిగతా 2 లో

## శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కు రాష్ట్రపతి


హకీంపేట్ విమానాశ్రయంలో సీఎం రేవంత్ రెడ్డి స్వాగతం

49 ఎంబీబీఎస్ విద్యార్థులకు రాష్ట్రపతి పట్టాలు ప్రదానం



హైదరాబాద్, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): శీతాకాల విడిది కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్‌కు వచ్చారు. మంగళవారం హకీంపేట్ విమానాశ్రయంలో ఆమెకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాగతం పలికారు. అక్కడి నుంచి నేరుగా భారీ కాన్వాయ్‌తో సికింద్రాబాద్ బొల్లారం లోని రాష్ట్రపతి

మిగతా 2 లో



### తెలంగాణ పాలిటిక్స్‌లో ఫార్ములా -

## ఈ రేస్ కలకలం

ఆరోపణలు ఎదుర్కొంటున్న కేటీఆర్ పై కేసుకు రంగం సిద్ధం

హైదరాబాద్, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): తెలంగాణ పాలిటిక్స్‌లో ఫార్ములా - ఈ కార్ రేసు వ్యవహారం కలకలం రేపుతోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై కేసుకు రంగం సిద్ధం అవుతున్నది. ఆయనపై కేసుకు గవర్నర్ ఆమోద ముద్ర వేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వ

మిగతా 2 లో




## నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ బాధ్యతల్లో మార్పులు

ఇకపై రిక్రూట్‌మెంట్ పరీక్షలను ఈ సంస్థ నిర్వహించదు

కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడి

న్యూ ఢిల్లీ, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): రిక్రూట్ మెంట్, ఎంట్రన్స్ ఎగ్జామ్స్ విషయాల్లో కేంద్రం కీలక మార్పులు తీసుకురానుంది. వీటి నిర్వహణ అంశంలో కేంద్రం ఏర్పాటు

మిగతా 2 లో



### రైతుల ఆదాయాన్ని పెంచేందుకు

## ప్రభుత్వం వ్యూహం

రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్

న్యూ ఢిల్లీ, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం ఆరు పాయింట్ల వ్యూహాన్ని సిద్ధం

మిగతా 2 లో

## సెట్లకు ఉన్నత విద్యామండలి కన్వీనర్ల నియామకం

ఈ మేరకు విద్యామండలి ఉత్తర్వులు జారీ

ఏ యూనివర్సిటీ ఏ సెట్‌ను నిర్వహిస్తుందో ప్రకటన




తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో ఉన్నత విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించే సెట్లకు ఉన్నత విద్యామండలి కన్వీనర్లను నియమించింది. ఈ మేరకు ఏడు సెట్లకు సంబంధించి కన్వీనర్లను నియమిస్తూ ఉన్నత విద్యామండలి ఉత్తర్వులు జారీ చేసింది. ఇక

మిగతా 2 లో

## గ్రూప్-2 లో ప్రశ్నలన్నీ టిడీపీ, కాంగ్రెస్ పార్టీ ద్రోహుల మీదనే

మండిపడ్డ బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



హైదరాబాద్, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ తాజాగా నిర్వహించిన గ్రూప్-2 పేపర్‌లో ప్రశ్నలు అన్నీ తెలుగు దేశం పార్టీ, కాంగ్రెస్ పార్టీ తదితర తెలంగాణ ద్రోహుల మీదనే ఇచ్చారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు. తెలంగాణ మలి దశ ఉద్యమానికి ఊపిరులూదిన కేసీఆర్ మీద కానీ, ఉద్యమాన్ని అగ్రగామి శక్తిగా నడిపి తెలంగాణ సాధించిన టీఆర్ఎస్ పార్టీ మీద కానీ ప్రశ్నలు రాకుండా చాలా జాగ్రత్తలు తీసుకున్నారని విమర్శించారు. రేవంత్ రచించిన కేసీఆర్

మిగతా 2 లో



## ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లకు కేంద్రం హెచ్చరికలు

గ్లామరైజ్ కంటెంట్‌ను చూపిస్తే దానిపై దర్యాప్తు చేస్తాం

న్యూ ఢిల్లీ, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): ఓటీటీ ప్లాట్‌ఫారమ్స్‌లో కంటెంట్‌పై ఎలాంటి నియంత్రణ లేదు. ఇటీవల సినిమాలు, వెబ్ సిరీస్‌ను తప్పనిసరిగా సెన్సార్ చేయాలనే డిమాండ్లు వస్తున్నాయి. ఈ క్రమంలో కేంద్రం ఓటీటీ

మిగతా 2 లో

# డయల్ 100, 108, 101' స్థానంలో ఇంటిగ్రేటెడ్ కమాండ్

మొదటి పేజీ తరువాయి

సర్వీసెస్ ఆపరేట్ చేయనున్నారు. దీంతో పోలీస్ (100), అంబులెన్స్(108), ఫైర్(101), చైల్డ్ వెల్ఫేర్, విమెన్ సేఫ్టీ సహా అత్యవసర పరిస్థితుల్లో సత్వర సేవలు అందనున్నాయి.

**ఎమర్జెన్సీ రెస్పాన్స్ టైమ్ తగ్గించేలా**

అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు, బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు దేశవ్యాప్తంగా ఒకే ఎమర్జెన్సీ నెంబర్ ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 112 నంబర్‌ను గతంలోనే అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని డయల్ 100కి వచ్చిన కాల్స్ 112 ద్వారా ఆయా డిపార్ట్‌మెంట్స్‌కు చేరుతున్నాయి. ప్రస్తుతం ఉన్న 'డయల్ 100' స్థానంలో దీనిని తీసుకొచ్చారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఎవరైనా డయల్ 100కు ఫోన్ చేస్తే 5 నుంచి 8 నిమిషాల వ్యవధిలో ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం, స్థానిక పోలీసులు ఘటన స్థలాలకు చేరుకుంటున్నారు. ఐతే కాల్స్ రూటింగ్‌లో కొంత సమయం ఆలస్యం అవుతుండడంతో సమస్యను





పరిష్కరించేందుకే ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రెస్పాన్స్ సమయం తగ్గించేందుకు డైరెక్ట్‌గా 112 కు కాల్స్ వెళ్లే విధంగా ఏర్పాట్లు చేసింది.

**అవగాహన వచ్చేంత వరకు 'డయల్ 100'**

'డయల్ 112'పై ప్రజల్లో అవగాహన వచ్చేంత వరకు 'డయల్ 100' అందుబాటులో ఉంటుందని పోలీసు శాఖ వెల్లడించింది. అప్పటికి వరకు 112తో పాటు డయల్ 100కి వచ్చే ఫోన్ కాల్స్ ఆటోమేటిక్‌గా 112కి ట్రాన్స్‌ఫర్ అవుతుంటాయి. సోషల్ మీడియా, పోలీస్ స్టేషన్స్, సిటీలో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్ ద్వారా ప్రచారం చేయనున్నారు. సామాన్యులకు అవగాహన కలిగేందుకు పోలీస్ వాహనాలు, ఫైర్ సర్వీసెస్ సహా ఎమర్జెన్సీ సర్వీసులు అందించే డిపార్ట్‌మెంట్స్ వెహికల్స్‌పై 'డయల్112' స్టిక్కర్లను అంటించనున్నారు.

## హైడ్రా ఏర్పడక ముందు ఉన్న నిర్మాణాల జోలికి వెళ్లం




మొదటి పేజీ తరువాయి

చేశారు. అలాగే గతంలో అనుమతులు తీసుకొని ఇప్పుడు నిర్మిస్తున్న వాటి వైపు వెళ్లమని, ఎలాంటి అనుమతలు లేకుండా నిర్మిస్తున్న వాటిపై హైడ్రా కూల్చివేస్తుందని చెప్పారు. అలాగే ఇటీవల కాలంలో తీసుకున్న అనుమతులు హైడ్రా తనిఖీలు చేస్తుందని వాటిల్లో లోపాలు ఉంటే ఆ నిర్మాణాలను అడ్డుకుంటామని తెలిపారు. ఇక ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా చెరువుల పరిరక్షణకు హైడ్రా పని చేస్తుందని అన్నారు. హైడ్రా పేదవాళ్లు, చిన్న వాళ్ల జోలికి రాదని, పేదవాళ్ల ఇండ్లు హైడ్రా కూల్చివేస్తుందనే తప్పుడు ప్రచారం నమ్మొద్దని రంగనాథ్ సూచించారు.

## స్థానికతపై ఎంబీబీఎస్, బీడీఎస్ విద్యార్థులకు హైకోర్టులో ఊరట

మొదటి పేజీ తరువాయి

వరకు తెలంగాణలో చదవడంతో పాటు ఎంబీబీఎస్ కూడా ఇక్కడే పూర్తి చేసిన వారికి తెలంగాణ స్థానికత కల్పిస్తారు. అయితే ఈ జీవో 140ని సవాల్ చేస్తూ మెడికల్ పీజీ విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ప్రభుత్వం తెచ్చిన జీవోని సవరణ చేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది.

## నమూనా చీరలను పరిశీలించిన సీఎం, మంత్రులు

మొదటి పేజీ తరువాయి

ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులతో కలిసి చీరల నమూనాలను పరిశీలించారు. రాష్ట్రంలోని 63లక్షల మంది మహిళా సంఘాలకు యూనిఫాం చీరలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మహిళా శక్తి లోగో, రంగులతో ఆకర్షణీయంగా చీరలు రూపొందించాలని ఆదేశించింది. అటు అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు కూడా యూనిఫామ్ చీరలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించి అవసరమైన చర్యలు చేపట్టింది.

## సెట్లకు ఉన్నత విద్యామండలి కన్వీనర్ల నియామకం

మొదటి పేజీ తరువాయి

ఏ యూనివర్సిటీ ఏ సెట్‌ను నిర్వహిస్తుందో కూడా ప్రకటించింది. ఇక సెట్ల నిర్వహణకు సంబంధించిన తేదీలను త్వరలోనే విడుదల చేస్తామని ఉన్నత విద్యా మండలి వెల్లడించింది.

సెట్ల కన్వీనర్లు వీరే

- టీజీ ఎప్‌సెట్ – ప్రొఫెసర్ బీ డీన్ కుమార్ ( జేఎన్‌టీయూ హెచ్)
- టీజీ పీజీసెట్ – ప్రొఫెసర్ అరుణ కుమారి ( జేఎన్‌టీయూహెచ్)
- టీజీ ఐసెట్ – ప్రొఫెసర్ అలువాల రవి(మహాత్మా గాంధీ యూనివర్సిటీ)
- టీజీ ఈసెట్ – ప్రొఫెసర్ పీ చంద్రశేఖర్(ఉస్మానియా యూనివర్సిటీ)
- టీజీ లాసెట్, టీజీ పీజీఎల్‌సెట్ – ప్రొఫెసర్ బీ విజయలక్ష్మీ(ఉస్మానియా యూనివర్సిటీ)
- టీజీ ఎడ్‌సెట్ – ప్రొఫెసర్ బీ వెంకట్రామ్ రెడ్డి(కాకతీయ యూనివర్సిటీ)
- టీజీ పీఈసెట్ – ప్రొఫెసర్ ఎన్ఎస్ దిలీప్(పాలమూరు యూనివర్సిటీ)

## స్థానిక సంస్థల ఎన్నికల్లో మారనున్న రిజర్వేషన్లు

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం మార్పులు చేసింది. ఇద్దరి కన్నా ఎక్కువ మంది పిల్లలు ఉన్న వారు సైతం గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు సోమవారం అసెంబ్లీలో మూడు గంటల పాటు జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నది.

**ప్రతి సారీ రిజర్వేషన్లు మార్పు**

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనలలో రాష్ట్ర ప్రభుత్వం మార్పులు చేసింది. ఇప్పటి వరకు ఒక సారి రిజర్వేషన్ ఖరారు అది పదేండ్ల పాటు (రెండు టర్ములు) కొనసాగేది. కానీ ప్రస్తుత ప్రభుత్వం దానిని ఒక టర్మకు కుదించింది. దీని ప్రకారం ప్రతి ఐదేండ్లకోసారి రిజర్వేషన్లు మారనున్నాయి. రిజర్వేషన్‌ను ఒక సారరే (ఒక టర్మ్) అమలు చేయాలని వినతులు వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు చట్టానికి ప్రతిపాదించిన సవరణలకు కేబినెట్‌ఆమోదం తెలిపింది. చట్ట సవరణతో గ్రామీణ ప్రాంతాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీ చైర్మన్‌లకు సంబంధించిన అన్ని రిజర్వేషన్లు మారనున్నాయి.

**ఇద్దరి కన్నా ఎక్కువ మంది పిల్లలున్నా పోటీ**

ఇద్దరు కన్నా ఎక్కువ మంది పిల్లలు ఉన్న తల్లిదండ్రులు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి ఇప్పటి వరకు అనుమతి లేదు. దీంతో ముగ్గురు, అంత కన్నా ఎక్కువగా పిల్లలున్న వారు పోటీ చేసేందుకు అనర్హులుగా ఉండేవారు. అలాంటి వారికి సైతం ఎన్నికల్లో పోటీకి అవకాశం కల్పించాలని కొంత కాలంగా వినతులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో చట్టానికి ప్రభుత్వం సవరణలు చేసింది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంత మంది పిల్లలు ఉన్నా పోటీ చేయవచ్చు.



ప్రతి మండలానికీ కనీసం ఐదు ఎంపీటీసీ స్థానాలు ప్రతి మండలంలో కనీసం ఐదుగురు ఎంపీటీసీ సభ్యులు ఉండేలా ప్రభుత్వం చట్టానికి సవరణలు తీసుకొచ్చింది. ఈ నిర్ణయం ద్వారా తక్కువ జనాభా ఉన్న గ్రామీణ మండలాల్లోనూ కనీసం ఐదుగురు ఎంపీటీసీ సభ్యులు ఉండనున్నారు. ఎంపీపీ ఎన్నిక సమయంలో ఎలాంటి సమస్య రాకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. స్థానిక సంస్థల్లో ఓటరు జాబితాలో ఓటరు చేరడానికి అర్హత తేదీని సైతం మార్చారు. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకునేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రతి ఏడాదికి ఒకసారి అవకాశం కల్పించేది. కానీ తాజాగా ఏప్రిల్, జూలై, అక్టోబరు ఒకటో తేదీని (ఏడాదిలో మూడు సార్లు) అర్హత తేదీగా మార్చారు. కేంద్ర ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా చట్టంలో మార్పులు చేశారు.

**సర్పంచ్‌లను తొలగించేందుకు కలెక్టర్లకు మరిన్ని పవర్స్**

సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లను తొలగించే విషయంలో కలెక్టర్‌లకు మరిన్ని అధికారాలు ఇస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకున్నది. దీనితో పాటుగా అనర్హత వేటు వేసే విషయంలోనూ చట్ట సవరణ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల ఖర్చు, ఈవీఎంలు, బ్యాలెట్‌బ్యాక్సుల వినియోగం విషయంలోనూ చట్ట సవరణకు ఆమోదం తెలిపారు. వీటితో పాటుగా అసెంబ్లీలో ఆమోదించనున్న పలు బిల్లులకూ కేబినెట్ ఆమోదం తెలపనున్నది. ఓఆర్ఆర్‌లోపలి 51 గ్రామ పంచాయతీలను దగ్గర్లోని మున్సిపాలిటిల్లో వీలినం చేయడం, హైడ్రా చట్టానికి సైతం కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

## రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం వ్యూహం

మొదటి పేజీ తరువాయి

చేసింది. మంగళవారం లోక్‌సభలో వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ సమాధానమిస్తూ, 2002-03లో రైతుల ఆదాయం నెలకు రెండు వేల 115 రూపాయల నుండి 2018-19లో నెలకు పది వేల 218 రూపాయలకు పెరగడంతో ఈ ప్రయత్నాలు ఫలితాలు ఇస్తున్నాయని అన్నారు. ఉత్పత్తిని పెంచడం, ఉత్పత్తి వ్యయాలను తగ్గించడం, ఉత్పత్తులకు న్యాయమైన కనీస ధరలను అందించడం, ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాలను భర్తీ చేయడం, వ్యవసాయాన్ని వైవిధ్యపరచడం మరియు సహజ మరియు సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం వంటి ఆరు పాయింట్ల వ్యూహం ప్రభుత్వ వ్యూహమని మంత్రి తెలిపారు. ఇదే కాకుండా రైతులకు తక్కువ వడ్డీకి



రుణాలు, ఎరువులు, యాంత్రిక వ్యవసాయానికి సబ్సిడీలు కూడా ఇస్తున్నామని చౌహాన్ తెలిపారు. గతేడాది రైతులకు రెండు లక్షల 14 వేల కోట్ల రూపాయల సబ్సిడీని ఇచ్చామన్నారు. కనీస మద్దతు ధరపై కేంద్ర ప్రభుత్వం రికార్డు స్థాయిలో కొనుగోళ్లు చేసిందని మంత్రి వెల్లడించారు. వ్యవసాయం మరియు రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కూడా 24 కోట్ల 60 లక్షల సాయిల్ హెల్త్ కార్డులు పంపిణీ చేయబడిందని, రైతులు తమ పొలాల్లో సరైన పంటను నిర్ణయించడంలో సహాయపడతారని తెలియజేసారు. మంగళవారం లోక్‌సభలో మంత్రి స్పందిస్తూ, జాతీయ ఉత్పాదక మండలి అధ్యయనం ప్రకారం రసాయన ఎరువుల వాడకాన్ని 10 శాతం తగ్గించినట్లు తెలిపారు. సాంప్రదాయ, సహజ మరియు సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం వల్ల నేలలో కార్బన్ కంటెంట్ మెరుగుపడుతుందని ఆయన అన్నారు. డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ కింద 142 మిలియన్ హెక్టార్లలో 30 మిలియన్ల మట్టి ప్రొఫైల్ ఇన్వెంటరీని ఇప్పటికే పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

## శాసనసభ నేటికీ వాయిదా

### స్వల్పకాలిక చర్చ అనంతరం సభ వాయిదా

### స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటన



హైదరాబాద్, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): తెలంగాణ శాసనసభ రేపటికి వాయిదా పడింది. పర్యాటక విధానంపై స్వల్పకాలిక చర్చ అనంతరం సభను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. బీఆర్ఎస్ సభ్యుల ఆందోళనల మధ్యనే రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యాటక రంగానికి సంబంధించి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సభకు వివరించారు. విరామం అనంతరం ప్రారంభమైన శాసనసభలో బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు ఆందోళనకు దిగారు. లగచర్ల రైతులను విడుదల చేయాలని, ఈ అంశంపై చర్చకు బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు పట్టుబట్టారు. కానీ స్పీకర్ చర్చకు అనుమతించలేదు. సభ్యుల ఆందోళనల మధ్యనే యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ వర్సిటీ బిల్లు, విశ్వవిద్యాలయాల చట్ట సవరణ బిల్లు, తెలంగాణ జీఎస్టీ సవరణ బిల్లులను సంబంధిత మంత్రులు సభలో ప్రవేశపెట్టారు. ఇక ఈ బిల్లులపై ఎలాంటి చర్చ చేపట్టకుండా శాసనసభ ఆమోదం తెలిపింది. అయితే లగచర్ల రైతులను తక్షణమే జైలు నుంచి విడుదల చేయాలని బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన చేశారు. ఇదేమీ రాజ్యం ఇదేమీ రాజ్యం దొంగల రాజ్యం, దోపిడీ రాజ్యం అంటూ నినాదాలతో హోరెత్తించారు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.

## శీతాకాల విడిది కోసం హైదరాబాద్ కు రాష్ట్రపతి



మొదటి పేజీ తరువాయి

నిలయానికి వెళ్లనున్నారు. తొలుత ఏపీలో మంగళవారం జరిగిన ఎయిమ్స్ స్నాతకోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ స్నాతకోత్సవంలో సుమారు 49 ఎంబీబీఎస్ విద్యార్థులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పట్టాలు ప్రదానం చేశారు. అనంతరం ఏపీలోని గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో హకీంపేటకు వచ్చారు. రాష్ట్రపతిని ఆహ్వానించిన వారిలో ముఖ్యమంత్రి, గవర్నర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మంత్రులు, అధికారులు ఉన్నారు. మంగళవారం నుంచి ఈ నెల 21 వరకు సికింద్రబాద్‌లోని బొల్లారంలో ద్రౌపది ముర్ము ఉండనున్నారు. ఈనెల 18న రాష్ట్రపతి నిలయంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. ఈ నెల 20న రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి బృందం, అధికారులు, పౌరులతో ఎట్ హోం కార్యక్రమం నిర్వహించనున్నారు.

## నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ బాధ్యతల్లో మార్పులు

మొదటి పేజీ తరువాయి

చేసిన ఉన్నత స్థాయి ప్యానెల్ దృష్టి సారించింది. దీంతో, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ బాధ్యతల్లో మార్పులు జరగనున్నాయి. ఇకపై రిక్రూట్‌మెంట్ పరీక్షలను ఆ సంస్థ నిర్వహించదని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. ఉన్నత స్థాయి ప్యానెల్ సిఫార్సు చేసిన సంస్కరణల్లో భాగంగానే ఈ మార్పులు చేశాం. ఇకపై రిక్రూట్‌మెంట్ పరీక్షలను ఎన్‌టీఏ నిర్వహించదు. కేవలం ప్రవేశ పరీక్షలు మాత్రమే నిర్వహిస్తుంది. ఇది 2025 నుంచి అమలుకానుంది. ఎన్‌టీఏను ప్రక్షాళన చేస్తాం. వచ్చే ఏడాది దీనిలో మరిన్ని మార్పులు రానున్నాయి. కొత్తగా పది పోస్టులు సృష్టిస్తాం. జీరో-ఎర్రర్ టెస్టింగ్ ఉండేలా ఎన్‌టీఏ పనితీరులో మార్పులు ఉంటాయి" అని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

**కేంద్రమంత్రి ఏమన్నారంటే?**

కామన్ యూనివర్శిటీ ఎంట్రన్స్ టెస్ట్ ఏడాదికి ఒక్కసారి మాత్రమే నిర్వహించనున్నాం. అంతేకాకుండా నీట్ యూజీ పరీక్షలు పెన్-పేపర్ విధానంలో నిర్వహించాలా? లేదా ఆన్‌లైన్‌లో చేపట్టాలా అనే విషయంపై ఆరోగ్య మంత్రిత్వశాఖతో చర్చలు జరుగుతున్నాయి. అయితే భవిష్యత్తులో అన్ని ప్రవేశ పరీక్షలు కంప్యూటర్ ఆధారితంగా నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది" అని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. కాగా నీట్ పేపర్ లీక్, ఇతర పరీక్ష నిర్వహణల్లో అవకతవకలు జరుగుతున్నాయి. దీంతో కేంద్రం ఆదేశాలతో విద్యాశాఖ ఉన్నతస్థాయి ప్యానెల్ సంస్కరణలకు ఉపక్రమించింది. ప్రవేశ పరీక్ష, రిక్రూట్‌మెంట్ పరీక్ష నిర్వహణల్లో సంస్కరణలు చేసింది. ఈ సిఫార్సుల ప్రకారం కొత్తగా ఈ మార్పులు జరుగుతున్నాయి.

## ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లకు కేంద్రం హెచ్చరికలు

మొదటి పేజీ తరువాయి

ప్లాట్‌ఫారమ్‌లకు హెచ్చరికలు జారీ చేసింది. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఓటీటీ ఫారమ్‌లకు అడ్వైజరీని జారీ చేసింది. డ్రగ్స్ వినియోగాన్ని ప్రోత్సహించడం, గ్లామరైజ్ కంటెంట్‌ను చూపిస్తే దానిపై దర్యాప్తు చేస్తామని ప్రభుత్వం హెచ్చరించింది. సిరీస్‌లు, ఇతర కంటెంట్‌ను ప్రసారం చేస్తున్న సమయంలో డ్రగ్స్‌పై ప్రచారం చేయొద్దని సూచించింది. సినిమాలు, సీరియల్స్‌లో నటులు మాదకద్రవ్యాల వినియోగాన్ని ప్రోత్సహించే సన్నివేశాలను యూజర్ వార్నింగ్ లేకుండా ప్రసారం చేయకూడదని చెప్పింది. డ్రగ్స్ వినియోగాన్ని చూపించడం వల్ల తీవ్ర పరిణామాలు ఉంటాయని చెప్పింది. అలాంటి సున్నితమైన కంటెంట్ ద్వారా యువత ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. డ్రగ్స్ వినియోగానికి సంబంధించిన సీన్స్ చూపించే సమయంలో తప్పనిసరిగా హెచ్చరికలు ఉండాల్సిందేనని చెప్పింది.

## తెలంగాణ పాలిటిక్స్‌లో ఫార్ములా - ఈ రేస్ కలకలం



మొదటి పేజీ తరువాయి

ప్రధాన కార్యదర్శి ఏసీబీకి లేఖ రాసినట్లుగా తెలుస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించడంతో ఎఫ్ఐఆర్ నమోదుకు ఏసీబీ సమాయత్తం అవుతున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఏ-1 గా కేటీఆర్, ఏ-2గా పురపాలక శాఖ అప్పటి స్పెషల్ సీఎస్ అరవింద్ కుమార్ పేరును చేర్చబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ విషయంలో ఇప్పటికే ఏసీబీ (ఏసీబీ) స్పీడ్ పెంచబోతున్న నేపథ్యంలో ఈ క్రమంలోనే హైదరాబాద్‌లో ఉన్నతాధికారులు భేటీ కావడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. దీంతో ఏ క్షణంలో ఏం జరగబోతున్నదనే దానిపై ఇటు బీఆర్ఎస్‌లో అటు పొలిటికల్ సర్కిల్స్‌లో ఉత్కంఠగా మారింది.

**అసెంబ్లీ సెషన్స్ తర్వాత రంగంలోకి**

సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో కేటీఆర్‌పై ఏసీబీ విచారణతో తలెత్తే రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఏడాది పాలనపై ప్రజల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ ఉన్న తరుణంలో కేటీఆర్ అరెస్టు చేస్తే ఎలాంటి పరిణామాలు జరుతాయనే ఆలోచనలో అధికార పక్షం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే అసెంబ్లీ సమావేశాలు ముగియగానే ఏసీబీ యాక్షన్ ప్లాన్ అమలు చేయబోతున్నదని పక్కాగా అన్ని అనుమతులు, ప్రొసీజర్స్‌తో కేటీఆర్ అరెస్టు ఉండబోతున్నదనే చర్చ వినిపిస్తోంది.

## గ్రూప్-2 లో ప్రశ్నలన్నీ టిడీపీ, కాంగ్రెస్ పార్టీ ద్రోహుల మీదనే

మొదటి పేజీ తరువాయి

ఆనవాళ్ల నిర్మూలన పథకంలో ఇది మరో అడుగు అన్నమాట అని వ్యాఖ్యానించారు. గ్రూప్ 2 ప్రశ్నపత్రాలను గాంధీ భవన్, ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఆత్రేయపురం పూతరేకులు తింటూ తయారు చేసినట్లుగా ఉందని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఎద్దేవా చేశారు. నాన్ లోకల్ కోటాలో కేవలం ఆంధ్ర అభ్యర్థులకు మాత్రమే లాభం జరగాలనే ఉద్దేశంతో ఈ పేపర్ తయారు చేశారని ఆరోపించారు. మీరెన్ని చేసినా కేసీఆర్ సంతకాన్ని చెరిపివేయలేరని తెలిపారు. తెలంగాణకు ద్రోహం చేస్తున్న వాళ్లను వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

## 52 శాతం మంది పురుషులకు గృహహింస

బెంగళూరు ఇంజనీర్ అతుల్ సుభాష్ తన భార్య, అత్తమామల వేధింపులతో విసిగిపోయి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు అతుల్ సుభాష్ సుమారు గంటన్నర వీడియో తీసి పోస్ట్ చేశాడు. అంతే కాకుండా 24 పేజీల సూసైడ్ నోట్‌ను కూడా వదిలిపెట్టాడు. అతుల్ సుభాష్‌కు న్యాయం చేయాలంటూ సోషల్ మీడియాలో ఇప్పుడు డిమాండ్ వినిపిస్తోంది. అతుల్ సుభాష్ ఆత్మహత్య లా అండ్ ఆర్డర్, సమాజంలో పురుషుల పట్ల ద్వంద్వ వైఖరిని బహిర్గతం చేసింది. అతుల్ సుభాష్‌పై అతని భార్య చాలా తప్పుడు కేసులు పెట్టింది. అతుల్ ఇలాంటి ప్రమాదకరమైన చర్య తీసుకునేంత మేరకు తనను బలవంతం చేశారు. ఈ కేసు తర్వాత, పురుషులపై అఘాయిత్యాలపై సోషల్ మీడియాలో స్వరాలు లేవనెత్తాయి. భారతదేశంలో ఇది మొదటి కేసు కాదు, ఇంతకు ముందు కూడా చాలా మంది పురుషులు ఇలాంటి హింసకు గురై ఆత్మహత్యకు పాల్పడ్డారు.బెంగళూరు టెకీ ఉద్యోగి అతుల్ సుభాష్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. అతని భార్య, అత్త, బావమరిదిని ప్రయాగ్‌రాజ్‌లో పోలీసులు అరెస్టు చేశారు. భార్య వేధింపులు భరించలేక 24 పేజీల లేఖ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు.భార్య వేధింపులు భరించలేక బెంగళూరు టెకీ అతుల్ సుభాష్ ఆత్యహత్య కేసు మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. అతుల్ భార్య నిఖితా సింఘానియాతోపాటు ఆమె తల్లి, సోదరుడుని కూడా పోలీసులు అరెస్టు చేశారు. ప్రయాగ్‌రాజ్‌లో వీరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడ కోర్టులో హాజరుపరిచి జ్యూడీషియల్ కస్టడీకి తరలించారు. బెంగళూరుకి చెందిన అతుల్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకోవడం దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. తన భార్య వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని 24 పేజీల లేఖను రాసి అతుల్ చనిపోయాడు. తప్పుడు కేసులతో భార్యలు వేధిస్తే.. భర్తలకు చనిపోవడం తప్ప మరొక దారి లేదని వాపోయాడు. భర్త ఉద్యోగం చేయకపోయిన జాబ్ చేస్తున్న భార్యకు భరణం ఇవ్వాలని తన బాధను వ్యక్తపరిచాడు. మొదట కోటి రూపాయిలు ఇవ్వాలని అతుల్ భార్య డిమాండ్ చేసిందని ఆ తర్వాత రూ.3 కోట్లు ఇవ్వాలని డిమాండ్చేసిందని లేఖలో వెల్లడించాడు. చివరకు తన కొడుకును చూడటానికి కూడా రూ.30 లక్షలు డిమాండ్ చేసిందని అతుల్ ఆందోళన చెందాడు. కొందరు మహిళలు ఇలానే మగాళ్లను వేధించి వారి కన్నీటి చుక్కలతో డబ్బు పోగేసుకుంటున్నారని అతుల్ బాధపడ్డాడు.తన భార్య వేధింపులు భరించలేక నెల రోజులు ముందు నుంచే ఆత్మహత్య చేసుకోవడానికి ప్లాన్ చేశాడు. తన క్రెడిట్ కార్డు బిల్లులు, ఆఫీస్ వర్క్ అన్ని కూడా పూర్తి చేసి ప్లాన్ ప్రకారం ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో పోలీసులు భార్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దీంతో ఆమె తప్పించుకుని తిరుగింది. చివరకు పోలీసుల చేతికి చిక్కింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 అందరికీ సమాన హక్కులు కల్పిస్తోంది. కానీ చాలా సందర్భాలలో భారతదేశంలో అలా జరగదు. ఉదాహరణకు, మనం శాంతిభద్రతల గురించి మాట్లాడినట్లయితే, పోలీసులు, న్యాయవ్యవస్థ పురుషుల కంటే మహిళలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాయి. దీనికి చాలా ఆధారాలు ఉన్నాయి. తాజా ఉదాహరణ గురించి మనం మాట్లాడుకుంటే, బెంగళూరు ఇంజనీర్ అతుల్ సుభాష్ ప్రస్తుతం దేశంలో చర్చనీయాంశంగా మారింది. మహిళలు కూడా ఆయన పట్ల తమ సంతాపాన్ని తెలియజేస్తున్నారు. భారత్‌లో ఆత్మహత్యల వార్తలు అసాధారణం కాకపోయినా, ఈ ఆత్మహత్య దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారి తీసింది. సోషల్ మీడియా వేదికగా భారత్‌లో మగవారి హక్కులపై పెద్ద చర్చ జరుగుతోంది.ముఖ్యంగా భారతీయ సమాజంలో తరతరాలుగా మహిళపై ఉండే వేధింపులు, అణచివేత నుంచి రక్షణ కల్పించడం కోసం ఏర్పాటు చేసిన చట్టాలు, కాలక్రమంలో పురుషుల పాలిట శాపంలా మారాయని వాదించే వారి సంఖ్య పెరిగింది.ఈ చట్టాలపై పోరాడుతూ, వీటి బాధితులకు అండగా అనేక స్వచ్ఛంద సంస్థలు మగవారి కోసం పోరాడుతున్నాయి. అటువంటి సంస్థలన్నీ ఇప్పుడు ఈ అతుల్ ఆత్మహత్య కేసును దేశంలో మగవారికి వ్యతిరేకంగా చట్టాల దుర్వినియోగానికి ఒక పెద్ద ఉదాహరణగా చూపుతున్నాయి.చట్టాల దుర్వినియోగం అరికట్టి, మగ-ఆడ అంటూ లింగ వివక్ష లేని చట్టాలు రావాలని వారు డిమాండ్ చేస్తున్నారు.స్త్రీల వేధింపుల వల్ల మగ వారి మరణాలు గణనీయంగా ఉన్నాయని చెబుతోంది ఏకం న్యాయ ఫౌండేషన్. దీనిపై ఆ సంస్థ ఒక నివేదిక విడుదల చేసింది.ఆ నివేదిక ప్రకారం, 2023లో ఆ సంస్థ పరిశీలించిన కేసుల్లో భర్తను భార్య చంపిన సుమారు 306 కేసుల్లో 213 వివాహేతర సంబంధాల వల్ల, 55 కుటుంబ గొడవల వల్లా, మిగతావి ఇతర కారణాల వల్ల జరిగాయి.ఇక అదే ఏడాది వారు అధ్యయనం చేసిన 517 ఆత్మహత్య కేసుల్లో మగవారు మానసిక వేధింపుల వల్ల 235 మంది, కుటుంబ హింస వల్ల 22 మంది, వివాహేతర సంబంధాల వల్ల 47 మంది, తప్పుడు కేసుల వల్ల 45 మంది, ఇతర కారణాల వల్ల 168 మంది మరణించారు.ఈ మానసిక వేధింపులు అంటే భార్య లేదా ఆమె తరపు వారి నుంచి తప్పుడు కేసులు, ఆరోపణలు, జైలుకు పంపుతామనే బెదిరింపులు వంటివే ఎక్కువని చెబుతోంది ఆ నివేదిక.ఇక ఎన్సీఆర్బీ సమాచారం ప్రకారం 2022లో భారత్‌లో ఆత్మహత్య చేసుకున్న వారు 1,70,924 మంది. వారిలో ఆడ, మగ కలిపి కుటుంబ సమస్యల వల్ల 31.7 శాతం, వివాహ సంబంధిత సమస్యల వల్ల 4.8 శాతం, ప్రేమ వ్యవహారాల వల్ల 4.5 శాతం మరణించినట్టు తెలుస్తోంది.2021 కూడా దాదాపు ఇదే శాతంలో ఉన్నాయి. ఇలా చనిపోయిన వారిలో 2022లో మగవారు 71.8 శాతం కాగా, ఆడవారు 28.2, అలాగే 2021లో మగవారు 72.5 శాతం మంది చనిపోగా, ఆడవారు 27.4 శాతం మంది చనిపోయారు. అంటే ఆత్మహత్యల్లో ఆడవారి కంటే మగవారివి రెండింతలు ఎక్కువ ఉంటున్నాయి.అదే సందర్భంలో వివాహ సమస్యలు, అందులోనూ కట్నం వేధింపులు, పిల్లలు కలగకపోవడం అనే కారణాలతో చనిపోయే వారిలో మాత్రం మహిళల సంఖ్య ఎక్కువని ఎన్సీఆర్బీ డాటా చెబుతోంది.అయితే ఈ విషయం బాగా వివాదం కావడంతో పురుషుల పట్ల న్యాయ వ్యవస్థ, సామాజిక వ్యవస్థ అనుచిత వైఖరిని వెల్లడిస్తుంది. నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్ పరిశోధన ప్రకారం.. భారతదేశంలో 52.4శాతం మంది పురుషులు తమ జీవితంలో ఏదో ఒక సమయంలో గృహ హింసకు గురవుతున్నారు. వీరిలో దాదాపు 49శాతం మంది పురుషులు మానసిక వేధింపులకు గురవుతున్నారు. 6శాతం మంది శారీరక హింసకు గురవుతున్నారు.

# స్వశక్తితోనే క్రీడలలో రాణించాలి

**- క్రీడలతో పూర్తి ఆరోగ్యం**
**- ప్రతి ఒక్కరూ గొప్ప క్రీడాకారులుగా ఎదగాలి**
**- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**



ములుగు జిల్లా, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): విద్యార్థినీ, విద్యార్థులు గ్రామస్థాయి క్రీడల నుండి జాతీయస్థాయి క్రీడల వరకు ఎదగాలని, స్వశక్తితోనే క్రీడలలో రాణించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. మంగళవారం ములుగు మండలంలోని జాకారం గ్రామంలో గల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవి చందర్, జిల్లా క్రీడల అధికారి తుల రవితో కలిసి సీఎం కప్ - 2024 జిల్లా స్థాయి క్రీడలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కలెక్టర్ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మండలాల నుంచి వచ్చిన క్రీడాకారుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలలో రాణించినప్పుడే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరికి డబ్బే ప్రధానం కాదని ఆరోగ్యం ముఖ్యమని, క్రీడా నైపుణ్యం స్వంత శక్తితో వస్తుందని అన్నారు. గ్రామస్థాయి, మండల స్థాయి క్రీడలలో రాణించి జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక కావాలని, రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన క్రీడాకారులను జిల్లా యంత్రాంగం మంచి గుర్తింపునిస్తుందని తెలిపారు. జిల్లా స్థాయి కబడ్డీ, హ్యాండ్ బాల్, అథ్లె%శీ%టిక్, యోగ , కిక్ బాక్సింగ్ క్రీడల్లో పాల్గొంటున్నారని, వారికి ఎలాంటి అసౌకర్యం ఏర్పడకుండా అన్ని





రకాల ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. క్రీడాకారుల కోసం ఎంత ఖర్చయినా వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నామని, క్రీడాకారులు పదిమందికి ఆదర్శంగా ఉండాలని సూచించారు. గ్రామ, మండల స్థాయిలో ప్రతిభ కనపరచి జిల్లా స్థాయికి వచ్చిన క్రీడాకారులు అదే ఉత్సాహంతో ఇక్కడ నుండి రాష్ట్ర స్థాయి కి వెళ్లలని అన్నారు. జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ మాట్లాడుతూ క్రీడాల వల్ల దేహదారుఢ్యం, క్రమశిక్షణ ఏర్పడుతుందను, ఈ క్రీడాలు అందరు ఉత్సాహంగా పాల్గొన్నరని, క్రీడలో గెలుపు ఓటమిలు సహజం ఓడినా వాళ్లు కుంగి పోకుండా గెలుపు కై ముందుకు సాగాలన్నారు. సీఎం కప్ మన జిల్లా కి వచ్చేలా మిగతా క్రీడాకారులతో పోటీ పడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ పైడాకుల అశోక్, ఎంపీ డి ఓ లు, పి టి లు, 9 మండలాల క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# సిఎం కప్ క్రీడల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**- జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**

మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): ముఖ్యమంత్రి ఛాంపియన్షిప్ ట్రోఫి (సిఎం కప్) క్రిడల నిర్వహణకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు నిర్వహించాలన్నారు. జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, మంగళవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు)లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) కే.వీర బ్రహ్మాచారి, డిప్యూటీ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ తిరుపతి రావు, సంబంధిత అధికారులతో కలిసి సీఎం కప్ క్రీడల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 19 నుండి 21 వరకు మహబూబాబాద్ జిల్లా స్థాయి ముఖ్యమంత్రి ఛాంపియన్షిప్ ట్రోఫీ, సీఎం కప్ క్రీడాలు నిర్వహించడం జరుగుతుందని, అందుకోసం జిల్లాలో ఉన్న పాఠశాలలు, గ్రామస్థాయిలో యువతి, యువకులు రిజిస్టర్ చేసుకొని మండల స్థాయి నుండి క్రీడలు నిర్వహించడం జరుగుతుందని, ఇందులో ప్రతిభ కనబరిచిన వారు ఈనెల 19 నుండి 21 వరకు మహబూబాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో క్రీడలు నిర్వహించడం జరుగుతుందని జిల్లాలోని యువ క్రీడాకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, అందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేయాలని, సూచించారు, ఇతర ప్రాంతాల నుంచి



వచ్చే క్రీడాకారుల కోసం వసతి భోజనం, రవాణా తదితర సౌకర్యాలను కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు, క్రీడలు జరుగు ప్రదేశంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ ,రక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీస్ అధికారులను ఆదేశించారు, అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో కలిసి పనిచేసే సీఎం కప్ క్రీడా పోటీలను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో మహబూబాబాద్ ఆర్డిఓ కృష్ణవేణి, జిల్లా క్రీడల అధికారి నీ జ్యోతి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహస్వామి, జడ్పీ సీఈవో పురుషోత్తం, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మురళీధర్, మున్సిపల్ కమిషనర్ రవీందర్, డిఈ ఉపేందర్, మహబూబాబాద్ తహసీల్దార్ భగవాన్ రెడ్డి, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): మంగళవారం చిట్యాల మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో అందిస్తున్న వసతులు, విద్యార్థుల ఆహార మెనూ, వంట గది, స్టోర్ రూం,డైనింగ్ హాల్ లను, విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనం ను పరిశీలించి, కామన్ డైట్ మెనూని పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల నుంచి భోజన నాణ్యతపై ఫీడ్‌బ్యాక్ తీసుకుని, వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా మెనూ పక్కాగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ఇటీవల ప్రభుత్వం డైట్ చార్జీ లు పెంచిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకటే కామన్ డైట్ అమలు చేస్తున్నదని, రోజు వారి అందించే డైట్ వివరాలు ఫ్లెక్సీ ని పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం మరియు చదువు అత్యంత ప్రాధాన్యమైనవని తెలిపారు. పాఠశాల వసతులు, భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి వ్యత్యాసం రావొద్దని ఆదేశించారు.

పాఠశాల ఆవరణలో కొంత స్థలం కాలిగా ఉందని అందులో పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయని చదును చెయ్యించాలని ప్రిన్సిపల్ కోరగా చదును చేసేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఏదేని లోపం వస్తే కఠిన చర్యలు



తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు వ్యక్తి గత పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఈ తనిఖీ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# అంతరాష్ట్ర డ్రగ్స్ ముఠా గుట్టు రట్టు...

హైదరాబాద్: డ్రగ్స్‌ను నియంత్రించేందుకు పోలీసులు, ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఏదో రకంగా డ్రగ్స్ సరఫరా మాత్రం కొనసాగుతూనే ఉంది.. డ్రగ్స్ కేసులో పట్టుబడితే కఠిన చర్యలు తప్పవన్న పోలీసుల హెచ్చరికలను కూడా డ్రగ్ ఫెడ్లర్‌లు పట్టించుకోని పరిస్థితి. షరా మామూలే అన్న చందంగా డ్రగ్స్ సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తూ ఉన్నారు. పోలీసులకు చిక్కడం.. ఆపై బయటకు వచ్చిన తర్వాత కొద్ది కాలం గ్యాప్ ఇచ్చి మళ్లీ డ్రగ్స్ సరఫరా చేయడం అనేది వారికి పరిపాటిగా మారింది. ఒకేసారి పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించాలనే అత్యాశతో చాలామంది డ్రగ్స్‌ను సరఫరా చేస్తూ పోలీసులకు చిక్కుతున్నారు. చాలాసార్లు యువకులు, స్టూడెంట్స్ కూడా డ్రగ్స్ సరఫరా చేస్తూ పట్టుబడిన సందర్భాలు ఎన్నో. విలాసవంతమైన జీవితం గడపాలని, అతి తక్కువ కాలంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశతో యువత ఈ దారిని ఎంచుకున్నట్లు సమాచారం. వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అయితే తాజాగా ఎల్బీనగర్‌లో భారీగా డ్రగ్స్ పట్టుబడటం సంచలనంగా మారింది.

# అతిథి అధ్యాపకుల కొరకు మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరణ



మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఫార్మసీ మహిళా కళాశాల మహబూబాబాద్ నందు బి. ఫార్మసీ బోధనాంశములలో ఫార్మస్యూటిక్స్ (1), ఫార్మకాలజి (1), ఫార్మకెమిస్ట్రీ (1) 2024-25 విద్యా సంవత్సరమునకు గాను అతిథి అధ్యాపకులుగా పనిచేయుటకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవని, అభ్యర్థులు తమ దరఖాస్తులతో పాటు బి. పార్మసీ, యం. ఫార్మసీ మరియు సర్వీస్ సర్టిఫికేట్స్ జిరాక్స్ ప్రతుల్ని తేది. 21/12/2024 సాయంత్రం 4:00 గంటల లోపు కళాశాల కార్యాలయంలో సమర్పించగలరని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. ఎం. స్వప్న రెడ్డి నేడు ఒక ప్రకటనలో తెలిపారు.

# జిల్లాలో సజావుగా గ్రూప్-2 పరీక్ష



**- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్**

జనగామ జిల్లా, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): మంగళవారం, జిల్లాలో గ్రూప్-2 పరీక్షలు (పేపర్-1, 2, 3, 4) సజావుగా జరిగాయని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచిన ఓఎంఆర్ జవాబు పత్రాలను పోలీసుల పర్యవేక్షణలో ప్రభుత్వ వాహనంలోకి ఎక్కించి, సీల్ వేసి కట్టుదిట్టమైన భద్రతా చర్యల నడుమ అత్యంత జాగ్రత్తగా హైదరాబాదులోని టీజీపీఎస్సీ కార్యాలయానికి తరలించారు. ఈ కార్యక్రమంలో జనగామ ఆర్డీవో గోపిరాం, ఏసీపీ పార్థసారథి, రీజనల్ కో-ఆర్డినేటర్ నర్సయ్య, టీజీపీఎస్సీ రూట్ అధికారులు, కలెక్టరేట్ ఏఓ మన్సూర్, ఇతర సంబంధిత అధికారులు, పోలీసులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సేవే పరామవాదిగా పేదలకు అండగా..!




**- ప్రజలతో మమేకం అవుతా పాండు రంగారెడ్డి**

పెద్దవూర: నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ఆత్మబంధు ఎప్పటికీ మీతో కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజూ ప్రజలతో మమేకమవుతున్న బుసిరెడ్డి పౌండేషన్ ఛైర్మెన్ పాండురంగారెడ్డి నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని ప్రజలకు అన్నివిధాలా అండగా వుంటా-ఆపదలో ఆదుకుంటా అంటూ ఆత్మ బంధు కార్యక్రమంలో భాగంగా నల్గొండ జిల్లా,నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని పలు మండలాల పరిధిలో గల వివిధ గ్రామాల్లో నివసించేమసిముక్కుల ప్రసాద్ యాదవ్ అనుముల మండలం హాలియ మున్సిపాలిటీ,పోలేపల్లి వెంకమ్మ నిడమనూరు మండలం సూరేపల్లి గ్రామం,కలుగుండ్ల వీరయ్య యాదవ్ త్రిపురారం మండలం, బొర్రాయిపాలెం గ్రామంల్లో స్వర్గస్తులు అయ్యినారని మాకు తెలియగానే వారి కుటుంబాలకి అండగా ఒక్కొక్క కుటుంబానికి 100 భోజనాలు చొప్పున పంపించారు.ఆర్థికంగా ఇబ్బందివున్న నిరుపేద కుటుంబాలకి మన ఆత్మబంధు ఎల్లప్పుడు అండగా ఉంటుందని,సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 9581742356 కు సంప్రదించాలని కోరారు. ప్రపంచంలో రెండు దానాలు అత్యంత ప్రాచుర్యం పొందాయి.అన్నదానం,రక్తదానం ఈ రెండింటికి అవినాభావ సంబంధం ఉందని అన్నారు.సేవే పరమావాదిగా, పేదలకు అండగా నలుగురిని ఆదరిద్దాం అనే సదుద్దేశంతో ఈ ఆత్మబంధు కార్యక్రమం చేపట్టడం జరిగింని పాండు రంగారెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి నాయకుల వరుస అక్రమ అరెస్టులను ఖండించండి

**- ప్రజా పాలన పేరుతో అక్రమ అరెస్టులు చేయడం సిగ్గుచేటు**
**- కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు మర్రి మహేష్**





హనుమకొండ కేయు, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): అర్ధరాత్రి 12 గంటల సమయంలో విద్యార్థి నాయకుల ఇంటికి వెళ్లి కేసులు పెడుతాం అని కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురించేస్తున్న పోలీసుల తీరు చాలా దుర్మార్గమని కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి నాయకులు మర్రి మహేష్, ఉడుత గణేష్ లు అన్నారు. ఈ సందర్భంగా వారు ఇరువురు మాట్లాడుతూ మాట్లాడుతు విద్యారంగనికి 30%బడ్జెట్ కేటాయించకుండా ప్రభుత్వ విద్యారంగా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూన్న ప్రభుత్వాలపై నిరంతరం విద్యార్థుల సమస్యలకై ఉద్యమిస్తున్న విద్యార్థి నాయకులను వేరే విద్యార్థి సంఘం పిలుపులో భాగంగా తప్పుడు సమాచారంతో సంబంధం లేకున్నా మమ్మల్ని అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటు అని, ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడవ గ్యారంటీగా ప్రజాస్వామ్య పునరుద్ధరణ చేపడతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇలా విద్యారంగ సమస్యలకే కోట్లాడుతున్న విద్యార్థి నాయకులను అక్రమ అరెస్ట్ లు చేయడం ప్రజాస్వామ్య పాలనకు విరుద్ధమన్నారు. ఈ అక్రమ అరెస్టులను ప్రజాస్వామికవాదులు మేధావులు ఖండించాలని వారు పిలుపునిచ్చారు.

# ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో వేగం పెంచాలి

**- అంగన్వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ**
**- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్**





జనగామ జిల్లా, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియలో వేగం పెంచాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం, జిల్లాలోని బచ్చన్నపేట మండలంలోని బచ్చన్నపేట గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహిస్తోన్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సర్వేయర్ లు చేసే ఆన్లైన్ నమోదును క్లుప్తంగా పరిశీలించి, దరఖాస్తుదారులతో మాట్లాడి వివరాలు సేకరించారు. గతంలో ఏదైనా గృహ పథకంలో లబ్ధి పొందారా.. ప్రస్తుతం నివసిస్తున్న ఇంటి స్వరూపం ఎలా ఉంది? ఇల్లు నిర్మించుకోడానికి భూమి(స్థలం) అందుబాటులో ఉందా.. స్థలం లబ్ధిదారుడి పేరు మీద ఉందా.. కుటుంబ సభ్యుల పేరు మీద ఉందా.. వంటి వివరాలపై ఆరా తీశారు. ఎటువంటి తప్పులకు ఆస్కారం లేకుండా సంబంధిత అన్ని ధ్రువపత్రాలను తనిఖీ చేసి, ఇంటి స్థలం, ప్రస్తుత ఇంటి చిత్రాలను సక్రమంగా యాప్ లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం అదే మండలంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి, ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట సరుకులు, గుడ్ల నాణ్యతను పర్యవేక్షించి, సంబంధిత రిజిస్టర్ లను తనిఖీ చేసి, సిబ్బందికి సూచనలు చేశారు. కేంద్రంలో జరుగుతున్న మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణ పనులను పరిశీలించి, పనుల్లో పురోగతి సాధించాలని సూచించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ వెంట ఎంపిడిఓ జితేందర్ రెడ్డి, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ యువత ప్రతిభను వెలికితిసేందుకే సీఎం కప్

**- రాష్ట్ర మంత్రి కొండ సురేఖ**
**- జిల్లా స్థాయి పోటీలను ప్రారంభించిన మంత్రి కొండ సురేఖ**





వరంగల్ జిల్లా, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడా ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించి ఒలింపిక్స్ లో పథకాలు సాధించాలనే లక్ష్యంతో సీఎం కప్ ను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అటవీ పర్యావరణ దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖ అన్నారు. మంగళవారం వరంగల్ సిటీ స్టేడియంలో సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలను మంత్రి కొండ సురేఖ వర్చువల్ గా ప్రారంభించారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, వర్చువల్ ద్వారా రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా గ్రామీణ, పట్టణ క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలలో తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వయంగా క్రీడాకారుడైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం కల్పిస్తూ, బడ్జెట్‌లో క్రీడలకు 375 కోట్ల రూపాయలు కేటాయించిందని మంత్రి అన్నారు. మొత్తం నాలుగు అంచెల్లో (గ్రామీణ, మండల, జిల్లా, రాష్ట్ర) పోటీలు జరుగుతున్నాయని తెలిపారు. వరంగల్ జిల్లాలోని 13 మండలాల్లోని దాదాపు 6000 మంది క్రీడాకారులకు గ్రామీణ, మండల, మునిసిపల్ స్థాయిల్లో పలుక్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి ప్రతిభ ఆధారంగా జిల్లా స్థాయికు ఎంపికైనారని అన్నారు. పారా ఒలింపిక్ క్రీడల్లో జాతీయ పథకాన్ని ఎగరవేసిన దీప్తి జీవన్ జ్యోతిని, జిల్లాకు వన్నె తెచ్చిన మరో ఎంతో మంది క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకొని ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని రాష్ట్ర, దేశ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి, ఏకాగ్రతకు, పోటీ తత్వానికి పెంచడానికి ఉపయోగపడతాయని అన్నారు. క్రీడా పోటీలలో గెలుపు ఓటములు సహజమని, ఓడిపోయిన వారు నిరుత్సాహ పడొద్దని, ముఖ్యంగా కోచ్ లు ఓడిపోయిన క్రీడాకారులకు మానసిక స్థైర్యం కల్పించాలని మంత్రి సూచించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు, గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు, రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని అన్నారు. ఈరోజు నుండి 21 వ తేదీ వరకు వరంగల్ లోని ఓ సిటీ స్టేడియంలో, చింతల్ మైదానంలో 36 క్రీడాంశాల్లో నిర్వహించే పోటీల్లో పాల్గొని జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచి, రాష్ట్ర స్థాయిలో అధిక పతకాలు సాధించి వరంగల్ జిల్లాను అగ్రగామిగా నిలపాలని కోరారు. వర్చువల్ ద్వారా రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డిలు మాట్లాడుతూ విద్యార్థులు చదవుతో పాటు క్రీడల్లో రాణిస్తేనే జీవితంలో ఎదుగుతారని అన్నారు. విద్యార్థి రోజూ నడక, పరుగు వ్యాయామం చేస్తేనే ఆరోగ్యకరంగా ఉంటారని తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో ఎంపికై క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో రాణించాలని తెలిపారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా పశుసంవర్ధక అధికారి బాలకృష్ణ, జిల్లా యువజన క్రీడల అధికారి సత్య వాణి, జిల్లా అధికారులు,జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ కైలాస్ యాదవ్ జిల్లా అధ్యక్షులు వెంకటరమణ కార్యదర్శి ధనరాజ్ పుశు, పీఈటీలు, కోచ్ లు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

**వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి**



హనుమకొండ జిల్లా, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): క్రీడలలో రాణించేలా క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. మంగళవారం హనుమకొండ జేఎన్ఎస్ లో చీఫ్ మినిస్టర్స్ కప్ -2024 జిల్లా స్థాయి పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీయడానికి చీఫ్ మినిస్టర్స్ కప్ పోటీలను రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. జిల్లాస్థాయిలో వివిధ క్రీడాంశాలలో పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా క్రీడాకారులు, క్రీడలలో క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర బడ్జెట్లో రూ. 375 కోట్లను కేటాయించారని పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు అనేవి సహజమని అన్నారు. క్రీడల్లో పాల్గొని స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడలలో అత్యుత్తమ ప్రతిభతో హనుమకొండ జిల్లా పేరును నిలబెట్టాలన్నారు. వరంగల్ జిల్లాతోనూ పోటీపడాలన్నారు. వివిధ క్రీడల్లో క్రీడాకారులు రాణించి హనుమకొండ జిల్లా పేరును తెలంగాణ రాష్ట్రంలో మార్మోగేలా తీసుకురావా లన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కాగా క్రీడాకారులను మేయర్ తదితరులు పరిచయం చేస్తున్నారు. హ్యాండ్ బాల్ ఆడి జిల్లా స్థాయి క్రీడా పోటీలను మేయర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి అజీజ్ ఖాన్, జిల్లా యువజన క్రీడా అధికారి అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# చిందు కులాస్తులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి



గోరి కొత్తపల్లి, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరి కొత్తపల్లి మండలం చెన్నాపురం శివారు ప్రాంతమైన అమరావతి నగర్ ఎస్సీ మాదిగల ఉపకులమైన చిందు కులస్తులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని గోరి కొత్తపల్లి మండల మండల డెవలప్మెంట్ అధికారి (ఎంపిడిఓ) కు తెలంగాణ చిందు విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు గడ్డం ప్రశాంత్ వినతిపత్రం అందజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా చెన్నాపురం గ్రామ శివారు అమరావతి నగర్ లో నివాసముంటున్న చిందు కులస్తులకు ఏ ప్రభుత్వ పథకానికి నోచుకోక దిక్కు తోచక , చిందు యక్షగాన కళలు మరుగునపడి ఉపాధి కోల్పోయి సతమతం అవుతున్నాము. మాకు కనీసం గృహలక్ష్మి పథకం కింద గోరి కొత్తపల్లి ఎంపిడిఓ ప్రత్యేక చొరవ తీసుకుని ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని తెలంగాణ చిందు విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు గడ్డం ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిందు రాజ్యాధికార సమాఖ్య ఉపాధ్యక్షులు గడ్డం పశుపతి, కళాకారులు సమ్మయ్య, శంకర్, శివాజి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధి లక్ష్యసాధనకు బ్యాంకర్లు సహకరించాలి


**డా. ఏం పి తంగిరాల అడిషనల్ సెక్రటరీ డిఎఫ్ఎస్, జి ఓ ఐ**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, డిసెంబర్ 17 (తీన్మార్ న్యూస్): జిల్లాలో వివిధ ఆర్థిక మద్దతు పథకాల లక్ష్య సాధనకు రుణాల అందించడంలో అన్ని బ్యాంకులు సహకరించాలని డాక్టర్ ఏం పి తంగిరాల అడిషనల్ సెక్రటరీ డి ఎఫ్ ఎస్, జి ఓ ఐ అన్నారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో నీతి అయోగ్ ఆకాంక్షిత జిల్లా కార్యక్రమం లో భాగంగా ప్రభుత్వ మరియు ప్రైవేటు బ్యాంకు అధికారులు మరియు జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం జిల్లా కలెక్టర్ జితేష్ వి పార్టీలతో కలిసి నిర్వహించారు. సమీక్ష సమావేశంలో భాగంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆకాంక్షిత జిల్లా అభివృద్ధిలోభాగంగా విద్య, వైద్య ఆరోగ్యశాఖ, సంవర్ధక శాఖ, గ్రామీణాభివృద్ధి సంస్థ, వ్యవసాయ శాఖ తదితర శాఖలలో జిల్లాలో చేపడుతున్న అన్ని కార్యక్రమాలను శాఖల వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేంద్ర సభ్యులకు వివరించారు. జిల్లాలో నీటి కుంటలు, కెనాల్ బండ్ ప్లాంటేషన్, మునగ సాగు మరియు మట్టితో ఇటుకల తయారీ వంటి కార్యక్రమాల గురించి కలెక్టర్ సభ్యులకు వివరించారు. బ్యాంకు వారు కంపారిజన్ బయో గ్యాస్ ప్లాంట్ కోసం కెనరా బ్యాంక్, తేనెటీగల పెంపకం, డ్రాగన్ ఫ్రూట్ సాగు, జీడి పంట వంటి పంటల విస్తరణ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, చిన్న తరహా పరిశ్రమలు, కమ్యూనిటీ పశువుల షెడ్లు తదితర అభివృద్ధి పనులు చేపట్టడానికి సహాయ సహకారం అందించాలని అడిషనల్ సెక్రటరీ, డీఎఫ్ఓ వారిని కోరారు. ఆకాంక్షిత క్రమంలో భాగంగా ఏఎంసీ రిజిస్ట్రేషన్, ఆసుపత్రులలో డెలివరీ, ఇప్పుడే పుట్టిన శిశువులకు తల్లిపాలు తాగించడం వంటి తదితర అంశాలలో పురోగతిపై అడిషనల్ సెక్రటరీ అధికారులను అభినందించారు. అనంతరం డాక్టర్ ఏం పి తంగిరాల అడిషనల్ సెక్రటరీ డి ఎఫ్ ఎస్, జి ఓ ఐ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, పీఎం జనరల్ యోజన మరియు ముద్ర రుణాలు మంజూరు చేయాలన్నారు.జిల్లాలో ముద్ర లోన్ మంజూరు ఎందుకు తక్కువగా బ్యాంక్ అధికారులను అడిగారు.ఆర్థిక మద్దతు పథకాలకు సంబంధించి 100% లక్ష్యసాధనకు బ్యాంకర్లు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఆకాంక్షిత జిల్లా అభివృద్ధిలో భాగంగా జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, నిన్న తరహా పరిశ్రమలు స్థాపించాలని అన్నారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకంలో భాగంగా జిల్లాలో ప్రధానమంత్రి సురక్ష యోజన, అటల్ పెన్షన్ యోజన, పిఎం జనధన్ యోజన పథకాలను పంచాయతీ సెక్రటరీలు అత్యధిక లక్ష సాధన చేసిన పదిమందికి జనవరి 26 రిపబ్లిక్ డే రోజున సన్మానం మరియు ప్రశంసా పత్రాలు అందజేపడతాయి అని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సిపిఓ సంజీవరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ రెడ్డి, మరియు అన్ని బ్యాంకుల అధికారులు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# జవహర్ నగర్ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వినతి



జవహర్ నగర్, డిసెంబర్ 17( తీన్మార్ న్యూస్): మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కసమస్యలు పరిష్కరించాలని కొరుతూ అదనపు కలెక్టర్ రాధికాగుప్తకు మేయర్ శాంతి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం రాధికాగుప్తను మేయర్ శాంతి ఆధ్వర్యంలో కలిసి పెండింగ్ సమస్యలకు పరిష్కారం చూపాలని వివరించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి ఫైరింగ్ కట్ట వరకు 100ఫీట్ల రోడ్డు నిర్మించాలని, జనాభాకు అనుగుణంగా మున్సిపల్ కార్మికులను పెంచాలని, జీహెచ్ఎంసీ పెండింగ్ నిధులు విడుదల చేయాలని అదనపు కలెక్టర్ను శాంతి కోరారు. సానూకులంగా స్పందించిన రాధికాగుప్త త్వరలోనే సమస్యలకు పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, నాయకుడు కోటేష్ గౌడ్ పాల్గొన్నారు.

# డిబిఎఫ్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ ప్రచారోద్యమం..



భిక్కనూర్: మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో భారత రాజ్యాంగ ప్రచారోద్యమ కార్యక్రమం మంగళవారం దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) రాష్ట్ర నాయకులు ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రాజ్యాంగ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం తిప్పాపూర్ గ్రామంలో నిర్వహించిన భారత రాజ్యాంగ ప్రచారోద్యమంలో జనవరి 26 వరకు నిర్వహిస్తామని, విద్యార్థులకు భారత రాజ్యాంగం పట్ల వ్యాస రచన పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరునికి ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రాజలింగం, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు శ్యామ్ రాజ్, భూపాల్, రాజయ్య, మండల కోఆర్డినేటర్ మహేష్, స్వామి, శంకర్, గ్రామ అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# హత్య కేసులో ఐదుగురు నిందితుల అరెస్టు..

**- భూవివాదవే కారణం..బంధువులే హంతకులు..**

**- కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి వెల్లడి..**



మల్హార్ రావు/కాటారం: కాటారం మండలంలోని దేవరాంపల్లి గ్రామంలో జరిగిన హత్య కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు మంగళవారం కాటారం డీఎస్పీ జి.రామ్మోహన్ రెడ్డి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. దేవరాంపల్లి గ్రామంలో మారుపాక సారయ్య (50)ను ఈ నెల 14న అదే గ్రామానికి చెందిన మృతుడి బంధువులు హత్య చేసినట్లు తెలిపారు.

రెండు రోజుల్లోనే హత్య కేసును కాటారం సీఐ నాగార్జున రావు,ఎస్ఐ అభినవ్ నేతృత్వంలో ఛేదించి నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు మారుపాక సమ్మయ్య, మారుపాక అంజి,మూడో వ్యక్తి మైనర్, మారుపాక లక్ష్మి, మారుపాక స్వప్నను అరెస్టు చేసినట్లు తెలిపారు. భూ వివాదంలో నిందితులు పథకం ప్రకారం మృతుడి కుటుంబ సభ్యులను చంపాలని గొడ్డలితో విచక్షణా రహితంగా దాడి చేసి పారి పోయినట్లు తెలిపారు.

# తొలగించిన అంబేద్కర్ విగ్రహాలను వెంటనే ఏర్పాటు చేయాలి..



దుబ్బాక: మెదక్ - ఎల్కతుర్తి జాతీయ రహదారి విస్తరణలో భాగంగా అక్బర్ పేట భూంపల్లి మండలం చిట్టాపూర్,పోతారెడ్డిపేట గ్రామాల్లో తొలగించిన డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ విగ్రహాలను వెంటనే ఏర్పాటు చేయాలని.. అందుకు తగిన నష్టపరిహారం ఇప్పించాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర పొలిట్ బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు డిమాండ్ చేశారు.ఈ మేరకు దుబ్బాక లోని సీఐ కార్యాలయంలో హెడ్ కానిస్టేబుల్ హరిసింగ్ కు దళిత సంఘాల నాయకులతో కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు.అనంతరం వారు మాట్లాడారు.రోడ్డు పనులు పూర్తయ్యేలోపే పునర్నిర్మిస్తామని చెప్పిన నేషనల్ హైవే అథారిటీ డీఈ రాయపాటి మోహన్ రోడ్డు నిర్మాణం పూర్తయి 15 నెల్లవుతున్నా స్పందించడం లేదన్నారు.రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతి, వర్ధంతి, ఇతర పండుగలను జర్పుకునేందుకు తమకు ఆయన విగ్రహం లేకుండా చేశారని..రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి నూతన అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.దళిత సంఘాల నాయకులు రామస్వామి,కాల్వ లింగం,సీహెచ్.జీవన్,ర్యాకం దాసు,కమటం రవీందర్,కమటం స్వామి,ర్యాకం శ్రీనివాస్,కమటం కనకయ్య పలువురున్నారు.

# వికారాబాద్ లో దారుణం...

**ఆధార్ లేదని వైద్యం నిరాకరణ**

హైదరాబాద్: పాముకాటుతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాలికకు వైద్యం అందించకుండా 108 సిబ్బంది నిర్లక్ష్యంగా ప్రవర్తించడంతో పరిస్థితి వికటించి బాలిక ప్రాణాలు కోల్పయిన ఘటన వికారాబాద్‌లో జరిగింది. రాత్రి సమయంలో చీకట్లో పాముకాటుకు గురైన బాలికను ఆధార్ కార్డు లేదనే కారణంతో ఆస్పత్రికి తీసుకెళ్లడానికి నిరాకరించడంతో ప్రాణాలు కోల్పోయింది. వికారాబాద్ జిల్లాలోని తాండూరులో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. 108 సిబ్బంది వ్యవహరించిన తీరుపై సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం నందారంలో సంచార జీవనం గడిపే కుటుంబంలో బాలికతో పాటు ఆమె తల్లి బిక్షాటన, కూలీ పనులతో జీవనం సాగించే వారు. 17ఏళ్ల సంగీత , దివ్యాంగురాలైన ఆమె తల్లి రంగమ్మలు భిక్షాటనతో పాటు గ్రామంలో కూలీ పనులు చేసుకునే జీవించే వారు. నిరాశ్రయులైన వీరు ప్రస్తుతం గ్రామంలోని ఓ పాత భవనంలో తలదాచుకుంటున్నారు. శనివారం రాత్రి 10 గంటలకు భోజనం చేసిన తర్వాత పాత భవనంలో గోడ మీద చెయ్యి పెట్టడంతో అక్కడే ఉన్న సంగీతను కాటు వేసింది.పాముకాటు వేయడంతో బాలిక కేకలు వేస్తూ తల్లికి చెప్పడంతో చుట్టుపక్కల వారి సాయంతో 108కి సమాచారమిచ్చారు. స్థానికులు ఫోన్ చేసిన అరగంట తర్వాత 10.30 గంటలకు అంబులెన్స్ వచ్చింది. తల్లితో పాటు పాము కాటుకు గురైన సంగీతను కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే బాలిక పరిస్థితి విషమంగా ఉ ండటంతో వైద్యుల సూచనతో తాండూరు ఆసుపత్రికి తరలించారు. అందుబాటులో ఉన్న మందులతో వైద్యులు చికిత్స చేసినా బాలిక ఆరోగ్య పరిస్థితి మారలేదు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్లాలని వైద్యులు సూచించడంతో సంగీత తల్లి రంగమ్మ స్థానికుల సహాయంతో మరోసారి 108 అంబులెన్సు సిబ్బందికి సమాచారం ఇచ్చారు.అర్ధరాత్రి దాటిన తర్వాత తాండూరు ఆస్పత్రికి 108 వాహనం చేరుకుంది. అయితే హైదరాబాద్ ప్రభుత్వాసుపత్రుల్లో ఆధార్ కార్డు లేని వారిని చేర్చుకోరని 108 సిబ్బంది ఆమెకు చెప్పారు. పాముకాటుకు గురైన తర్వాత తమతో పాటు ఏమి తెచ్చుకోలేదని చెప్పడంతో ఆధార్ కార్డు ఉంటేనే అంబులెన్సులో తీసుకెళ్తామని స్పష్టం చేశారు. స్థానికులు నచ్చజెప్పినా సిబ్బంది హైదరాబాద్ తీసుకెళ్లేందుకు అనుమతించలేదు. కాసేపటికే పరిస్థితి విషమించి సంగీత ప్రాణాలు కోల్పోయింది. తన బిడ్డ ప్రాణాలు కోల్పోడానికి అంబులెన్సు సిబ్బందే కారణమంటూ రంగమ్మ విలపించడం అందరిని కలిచి వేసింది.

# బిల్లుల చెల్లింపుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఎమ్మెల్యే వేముల




కమ్మర్ పల్లి : నియోజకవర్గ అభివృద్ధి నిధులు, ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా చేపట్టిన చిన్న చిన్న పనులకు కూడా బిల్స్ ఎందుకు క్లియర్ చేయట్లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం శాసనసభ ప్రశ్నోత్తరాల్లో బిల్లుల చెల్లింపులో జరుగుతున్న జాప్యం పై ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి సంవత్సరం అయిన ఒక్క పథకం సక్రమంగా అమలు కావడం లేదున్నారు.ఆరు గ్యారెంటీలు..13హామీలు ఊసే లేదున్నారు. రాష్ట్రానికి ఆదాయం వస్తున్న, అయినా సంవత్సర కాలంగా రూ. లక్ష 27వేల కోట్ల అప్పు తెచ్చారని విమర్శించారు.బాల్కొండ నియోజకవర్గంలోనే పలు కుల సంఘ భవనాలు, మహిళా భవనాలు, కళ్యాణ మండపం, బడులు, ఇప్పటి వరకు 143 పనులకు రూ.6 కోట్ల బిల్లులు చెల్లించలేదని, 33 గుళ్లకు రూ.3 కోట్ల బిల్లులు చెల్లించలేదన్నారు.ఇది ఒక్క బాల్కొండ సమస్య మాత్రమే కాదని, రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేల సమస్య అన్నారు.చిన్న బిల్లులు ప్రభుత్వం వెంటనే క్లియర్ చేయాలని కోరారు. పనులు చేసిన వాళ్ళు కాంట్రాక్టర్లు కాదని, విద్యా కమిటీలు, ఆయా కుల సంఘాల వాళ్ళు, మహిళా సంఘాల వాళ్ళు జమైె కట్టించుకున్నారన్నారు.అట్లాంటి చిన్న చిన్న బిల్లులు కూడా ప్రభుత్వం చెల్లించకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందరు ఎమ్మెల్యేలు ఈ సమస్య ఎదుర్కొంటున్నారని, అట్లాంటి చిన్న బిల్లులు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరారు.

# 7.04 ఎకరాలు ప్రభుత్వ ఇండ్ల స్థలాల భూమి కబ్జా..

**- ప్రజావాణిలో జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేసిన మాజీ ఎంపీటీసీ కర్రే వార్ రాములు..**

**- ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది నిజమే.. భూ కబ్జాలపై పరిశీలన జరుపుతాం: మండల తాసిల్దార్ ఎండి ముజీబ్**



మద్నూర్: మద్నూర్ మండల కేంద్ర గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ఇండ్ల స్థలాల భూమి సర్వే నెంబర్లు 583, 584, 846, ఈ మూడు సార్లు నంబర్లలో మొత్తం 7.04 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇద్దరు వ్యక్తులు కబ్జా చేసుకున్నట్లు సోమవారం నాడు ప్రజావాణిలో కామారెడ్డి జిల్లా కలెక్టర్కు మద్నూర్ గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యులు కర్రే వార్ రాములు ఫిర్యాదు చేశారు. ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదుపై మంగళవారం ఉదయం మద్నూర్ మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ ఆవరణంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమి అక్రమంగా కబ్జా చేసినట్లు 16 రకాల కాపీలను ఆయన విలేకరులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ రెవిన్యూ ధరణి రికార్డుల్లో ఈ మూడు సర్వే నెంబర్లలో గల భూమి ప్రభుత్వ ఇండ్ల స్థలాల భూమిగా రికార్డుల్లో ఉందని తెలిపారు. ప్రస్తుతం ధరణి రికార్డు ప్రకారం కలెక్టర్కు రుజువులతోపాటు ఫిర్యాదు చేసినట్లు ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు. సర్వే నెంబర్ 583లో 2.01 ఎకరాలు సర్వే నెంబర్ 584లో3.11 ఎకరాలు సర్వేనెంబర్ 846లో1.32 ఎకరాలు మొత్తం కలిసి 7.04 ఎకరాలు ప్రభుత్వ భూమిని ఇద్దరు మద్నూర్ మండల కేంద్రానికి చెందిన వ్యక్తులే కబ్జా చేసినట్లు తెలిపారు. సర్వేనెంబర్ 584 లో గల 3.11 ఎకరాల భూమిలో ఒక వ్యక్తి పత్తి మిల్లు కోసం కబ్జా చేశారని, మరొక వ్యక్తి సర్వే నెంబర్లు 583, 846లో గల ప్రభుత్వ ఇండ్ల స్థలాల భూమిని కబ్జా చేసి చట్ట వ్యతిరేకంగా పట్ట మార్పిడి చేసుకొని అందులో భవనాలు నిర్మించుకొని ఇంకా కొంత భూమిని ఇతరులకు విక్రయించడం జరిగినట్లు తెలిపారు. ఈ సర్వే నెంబర్ల భూమి 1972లో ప్రభుత్వం గజిట్ చేసుకోవడం జరిగిందని, అయినప్పటికీ ప్రభుత్వ అధికారులు ప్రభుత్వ భూములపై నిఘా పెట్టకపోవడం అక్రమ కబ్జాలకు గురైందని, వీటిని స్వాధీనం చేసుకుంటే ప్రభుత్వ పరంగా నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించ డానికి ఎంతో అనుకూలమైన స్థలాలు ఉన్నాయని, ఈ మూడు సర్వే నెంబర్ లపై చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని మద్నూర్ మండల తాసిల్దార్ ఎండి ముజీబ్ కు ఫోన్ ద్వారా అడిగి వివరణ కోరగా.. ఆ మూడు సర్వే నెంబర్ లపై ప్రభుత్వ భూమి కబ్జా అయినట్లు ప్రజావాణి లో జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు ఇచ్చిన మాట నిజమేనని, కలెక్టర్ ఆదేశాల మేరకు కబ్జాకు గురైన సర్వే నెంబర్లు భూమిని పరిశీలన జరిపి జిల్లా కలెక్టర్ నివేదికలు పంపుతామని తాసిల్దార్ వివరణ ఇచ్చారు.

# గోషామహల్ పోలీస్ స్టేడియంలో ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణాన్ని విరమించుకోవాలి..



సుల్తాన్ బజార్ : గోషామహల్ పోలీస్ స్టేడియంలో ఉస్మానియా ఆస్పత్రి నిర్మించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని విర మించుకోవాలని గోల్కొండ జిల్లా బిజెపి అధ్యక్షులు పొండు యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గోషామహల్ పరిరక్షణ సమితి అధ్యక్షులు వినోద్ యాదవ్ ఆధ్వర్యం లో చక్నా వాడీ నాలా నుండి గోషామహల్ పోలీస్ స్టేడియం ప్రధాన గేటు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో పొండుయాదవ్ మాట్లాడుతూ.. వారసత్వ కట్టడాలను కూ ల్చొద్దని నిబంధనలు ఉన్నాయని, కానీ ప్రజా అవసరాల కోసం శిథిలా వస్థకు చేరి నిరుపయోగంగా మారిన ఉస్మానియా ఆస్పత్రి పాత భవ నాన్ని కూల్చడంలో తప్పేమీ కాదన్నారు. అవసరమైతే ఉస్మానియా పాత భవనం కూల్చి అదే స్థలంలో, అదే డిజైన్లతో కూడిన కొత్త భవనం నిర్మించాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. ఆసుపత్రి నిర్మాణం కోసం అనవసరంగా గోషామహల్ పరిసర ప్రాంతాల బస్తీలకు చెందిన వేలాది కుటుంబాలను ఇబ్బంది పెట్టవద్దని కోరారు. ప్రభుత్వం మొండి గా వ్యవహరిస్తే గోషామహల్ నియోజకవర్గంలోని అన్నిపార్టీలు, ప్రజాసంఘాలు కలిసి పోరాడుదాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఫ్లోర్ లీడర్ శంకర్ యాదవ్,కార్పొరేటర్లు లాల్ సింగ్, రాకేశ్ జైశ్వాల్,బిఆర్ఎస్ నాయకురాలు శాంతిదేవి, సురేష్ ముదిరా జ్, దత్తు కోయల్కర్, కోరి శైలేష్ కురువు, బెజ్జిని శ్రీని వాస్, బిజెపి నాయకులు బంగారు సుధీర్, ఆల పురు షోత్తం, రాము, వినోద్, రఘు, కాంబ్లే, అనిలా యాద వ్, రామకృష్ణ, గోషామహల్ పరిరక్షణ సమితి ప్రతి నిధులు న్యాయంతబాద్ నేహాల్, దుర్గాయాదవ్, విష్ణు, వీరేందర్, కిరణ్, సరస్వతి, ఉమ, పుష్ప, మ హేష్, గణేష్, రోహన్, రామ్, పవన్, చంద్రమోహ న్, ఈశ్వర్, రవి, రామ్ శివ, కేదార్, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలు పరిష్కరించేంతవరకు వరకు ధర్మ సమాజ్ పార్టీ పోరాటం



కంఠేశ్వర్ :ప్రభుత్వం పేద ప్రజల సమస్యలు పరిష్కరించేంతవరకు ధర్మసమాజ్ పార్టీ పోరాటం తప్పదని నిజామాబాద్ ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు మహిపాల్ తెలిపారు. ఈ మేరకు సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పేద మధ్య తరగతి వర్గాలైన బీసీ ఎస్సీ ఎస్టీ , ఈబీసీ ప్రజలకు విద్యా వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు సాధనకై ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సుమన్ మహారాజ్, జిల్లా అధ్యక్షులు మహిపాల్ మహారాజ్ ఆమరణ నిరాహార దీక్ష ధర్నా చౌక్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు మహిపాల్ మాట్లాడుతూ.. ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత విద్యను అందించాలి. ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత వైద్యాన్ని అందించాలి. ప్రజలందరికీ చేసుకోవడానికి వారి వారి అర్హతలను బట్టి ఉపాధి అందించాలి. అర్హులైన వారందరికీ సాగునీటి సౌకర్యంతో ఒక ఎకరం వ్యవసాయ భూమిని ఇవ్వాలి. అర్హులైన వారందరికీ 200 గజాల స్థలంలో నాలుగదుల ఇల్లు ని నిర్మించి ఇవ్వాలి.

ఈ 5 డిమాండ్స్ ని గత నెల రోజు నుండి ప్రభుత్వం ముందు ఉ ంచుతూ జిల్లా కలెక్టర్ కి, ఎమ్మార్వో కి వినతిపత్రం ఇచ్చిన, ధర్నాలు నిర్వహించిన, రిలే నిరాహార దీక్షలు చేసిన ప్రభుత్వం ఏలాంటి స్పందన లేదన్నారు. అందుకే ఈ ఆమరణ నిరాహార దీక్షలు నిర్వహించడం జరుగుతుంది అని తెలియజేశారు.

ఈ కార్యక్రమం లో రాష్ట్ర నాయకులు ప్రేమ్ కుమార్ ,జిల్లా నాయకులు ప్రశాంత్, మురళి,మండలాల అధ్యక్షులు శుభాష్, గంగాధర్, మహేష్, కైలాష్,నిశాంత్, బిసి సంఘాల వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్ గౌడ్, కెటవిపీఎస్ గంగాధర్, అంబెడ్కర్ యువజన సంగం అధ్యక్షులు లింగన్న, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ చట్టం తెచ్చి అమలు చేయాలి

హైదరాబాద్: ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ చట్టం ప్రవేశ పెట్టి ఆమోదం తెలుపాలని జాతీయ సోషలిస్ట్ కూటమి డిమాండ్ చేసింది. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ జాతీయ కై దేశ వ్యాప్త ఉద్యమంలో భాగంగా అబిట్స్ లోని సుర్యలోక్ కాంప్లెక్స్ లో మేధావుల తో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సోషలిస్ట్ కూటమి జాతీయ చైర్మన్ యల్. జై బాబు మాట్లాడుతూ 1991గ్లోబలైజేషన్ అర్థక సంస్కర్ణ లు అమలు మూలంగా ప్రభుత్వ రంగం తగ్గిపోయి 90శాతం ప్రై వేట్ రంగం పెరిగిందన్నారు. ప్రై వెట్లో రిజర్వేషన్ లేకపోవటం మూలంగా రిజర్వేషన్ వర్గాలకు తీరని అన్యాయం జరుగుతుంది. 10శాతం కూడా లేని ప్రభుత్వ రంగంలో రిజర్వేషన్ సరిగ్గా అమలు జరగనందున ఇక్కడ అన్యాయమే జరిగిందన్నారు. ఉన్నది కూడా ప్రయివేట్ పరం గా మారే పరిస్థి ఉన్నందున త్వరగా ప్రై వేట్ లో రిజర్వేషన్ చట్టం అమలులోకి తేవాలని డిమాండ్ చేసారు. 1981సెన్సెస్ ప్రకారంఇప్పటికి రిజర్వేషన్ అమలు మూలంగా బిఃః బిబి లు 2లక్షల ఉద్యోగాలు కోల్పోయార ని 2024జనాభా ప్రకారం అమలు రిజర్వేషన్లు అమలు చేయాల న్నారు. ప్రభుత్వ రంగాల్లో కేంద్రం లక్షలు కోట్లు పెట్టుబడులు విత్ డ్రా చేయుడం మూలంగా40% బిఃః బిబి ఓబీసీలు కోల్పోయరని ఆవేదన వ్యక్తం చేసారు. ఇక భారీ ఉద్యోగాలు ప్రభుత్వరంగంలో లేనట్లేనని ప్రై వేట్ లో మాత్రమే ఈ అవకాశం ఉన్నందున నూతన చట్టంతెచ్చి న్యాయం అందించాలన్నారు.ఓసి లు 61.6%ఉద్యోగాల్లో సంపదలో 51.6%సమానత్వాన్ని దాటి ఉన్నారని ఎస్సిఎస్టి లు కలిపి 5% ఓబిసి లు 4%మాత్రమే ఉ న్నారని ఎప్పటికి సామజిక ఆర్థిక అసమానతలు తొలగిస్తారని ప్రశ్నించారు. రిజర్వేషన్లు -సమానత్వాన్ని ఎప్పటికీ కాపాడుతారో కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు చర్చ జరపాలన్నారు. ప్రశ్నిస్తే కక్ష గట్టి సోషల్ -పొలిటికల్ యాక్టివిటీస్ని క్రిమినల్ యాక్టివిటీస్ గా మార్చి సామజిక వేత్తలను అక్రమంగా జైల్లో పెడుతున్నారు ఇది అన్యాయం అన్నారు. నిమ్న జాతులను వివక్షతతో చూడడం రాజ్యాంగ విరుద్ధం. రాజ్యాంగం హక్కులు కాపాడుకునే స్వేచ్ఛ ఉందన్నారు.దేశం చైనాను మించి వృద్ధి రావాలంటే సూక్ష్మ -చిన్న -మధ్య -భారీ పరిశ్రమలు ఏర్పాటు కు సదుపాయులు అందుబాటులోకి రావాలని. కులవృత్తులు బలోపేతం అవ్వాలని బ్యాంకులు పెట్టుబడులు గ్రామస్థాయి కి బలంగా సేవలు విస్తరించాలన్నారు. ప్రభుత్వ రంగసంస్థల్లో ల్లో . బ్యాంక్ ల్లో ఆర్థిక రంగాల్లో. చట్ట సభల్లో కార్పొరేట్ శక్తులు శాశిస్తున్నారని. రాజ్యాంగ అమలుకు అడ్డు పడుతున్నారన్నారు. 94శాతం అనార్గ నైస్డ్ ప్రజల సంక్షేమం ఆర్థిక రంగంతో ముడిపడి ఆర్థక రంగంలో ప్రజలంతా లబ్ధి పొందు తున్నందున ప్రై వేట్ రంగం ఎంత పెరిగితే దేశం అంత అభివృద్ధి చెందుతుంది అందుకే చట్టభద్ధత ఉన్న అన్ని ప్రై వేట్ సంస్థల్లో రిజర్వేషన్ అడిగే హక్కు ఉన్నందున కేంద్ర ప్రభుత్వం ప్రై వేట్ రంగాన్ని బ్యాలన్స్ చేసి చట్టం అందించాలని దీనిపై అన్నీరాజకీయ పార్టీలతో పార్లమెంట్లో చర్చ పెట్టాలని. ప్రభుత్వ -ప్రై వేట్ ఉద్యోగులకు నూతన పెన్షన్ఒకే విధానం తో చట్టం కల్పించాలని డిమాండ్ చేసారు. ఈ సందర్భం గా భుక్య ప్రసాద్,నాయకత్వంలో తెలంగాణా రాష్ట్ర కమిటి ఏర్పడింది. ఈ సమావేశం లో జై స్వరాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు శ్రినివా గౌడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు అప్పల్ రాజు,సిహెచ్ బాల క్రిష్ణ, పి,వెంకట్ రావు,తదితరులు పాల్గొన్నారు.

# చలిదృష్ట్య పాఠశాల సమయంలో మార్పులు చేయాలి



ఆదిలాబాద్ టౌన్: జిల్లావ్యాప్తంగా రోజురోజుకు చలి తీవ్రత పెరగడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని కావున పాఠశాల సమయంలో మార్పులు చేయాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, జలంధర్ రెడ్డి కోరారు. ఈ విషయమై సోమవారం కలెక్టరేట్ ఏవో రామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. గత రెండు మూడు రోజులుగా జిల్లాలో విపరీతంగా చలి పెరిగిందన్నారు. దీనివల్ల విద్యార్థులు పాఠశాలకు రావడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి ఆరోగ్యంపై కూడా ప్రభావం పడుతుందన్నారు. కావున జిల్లా వ్యాప్తంగా పాఠశాలలను ఉ దయం 10 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పనిచేసేలా సమయ మార్పుకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులుజారిచేయలని కోరారు. గతంలో కూడా ఈ విధంగా చలి తీవ్రత పెరిగినప్పుడు విద్యార్థులు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని కలెక్టర్ ఉదయం 10 గంటలకు సాయంత్రం నాలుగు గంటల వరకు అనుమతించినట్లు గుర్తు చేశారు.కార్యక్రమంలో నాయకులు, సంజీవరెడ్డి ఉన్నారు.

# జీవో 21ను సవరించాలి

**– కనీస వేతన సలహా మండలిలో అన్ని కార్మిక సంఘాలకూ ప్రాతినిధ్యం కల్పించాలి**

**– సీఐటీయూ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు కలిసి ముందుకెళ్లాలని నిర్ణయం**



ముషీరాబాద్: వివక్షాపూరితంగా రెండు కార్మిక సంఘాలకు మాత్రమే ప్రాతినిధ్యం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కనీస వేతన సలహా మండలి జీవో 21ని తక్షణమే సవరించి అన్ని కార్మిక సంఘాలకూ భాగస్వామ్యం కల్పించాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. జీవో 21పై కార్మిక సంఘాల అభిప్రాయాలను కూడగట్టేందుకు సీఐటీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వివిఎస్.రావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం..సాయిబాబు మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం కోలిండియాలోని జేబీసీసీఐలోను, ఈపీఎఫ్, ఈఎస్ఐ కమిటీలలో ఐఎన్‌టీయూసీ వంటి సంఘాలకు స్థానం కల్పించనప్పుడు సీఐటీయూ చొరవతో అన్ని సంఘాలూ ఐక్యంగా ప్రభుత్వ వైఖరిని ఖండించాయని, రాష్ట్రంలో ఐఎన్‌టీయూసీ ఈ ఆందోళనలో కలిసి వచ్చిందని గుర్తు చేశారు. కనీస వేతన సలహా మండలిలో కూడా అన్ని సంఘాలకూ ప్రాతినిధ్యం కోసం పోరాడాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ తీర్మానాన్ని ప్రవేశపెడుతూ మాట్లాడారు. కనీస వేతన చట్టం %–% 1948 ప్రకారం.. రాష్ట్రంలోని అన్ని ట్రేడ్ యూనియన్ల నుంచి కనీస వేతన సలహా మండలి కోసం పేర్లను తీసుకున్నదని తెలిపారు. కానీ సలహా మండలిలో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీకి మాత్రమే ప్రాతినిధ్యం కల్పించారని, స్వతంత్ర సంఘాల పేరుతో కొందరినే కార్మిక ప్రతినిధులుగా నియమించడం సరైన చర్య కాదన్నారు. తక్షణం ఆ జీఓను సవరించి కోటి మందికి పైగా కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తున్న కార్మిక సంఘాలన్నింటికీ స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించే వరకూ అన్ని కార్మిక సంఘాలూ ఈ సమస్యలపై ఐక్యంగా కృషి చేయాలని, ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధం కావాలని కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి.యూసుఫ్, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రెబ్బా రామారావు మాట్లాడుతూ.. కనీస వేతనాల సలహా మండలిలో ఏఐటీయూసీకి ప్రాతినిధ్యం కల్పించినా ఆ మండలిలో అన్ని సంఘాల ప్రాతినిధ్యం, సహకారం లేకుండా ఏమీ సాధించలేమని ఏఐటీయూసీ ఆఫీస్ బేరర్స్ అభిప్రాయపడ్డారని చెప్పారు. ఈ సమావేశంలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆమోదిస్తున్నామని, ఉమ్మడి కార్యాచరణలో భాగస్వాములవుతామని తెలిపారు. ప్రభుత్వ ఏకపక్ష చర్యను ఖండిస్తున్నానని, అన్ని యూనియన్లకూ ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. అన్ని కార్మిక సంఘాలూ ఐక్యంగా వినతిపత్రాలు ఇవ్వడంతో పాటు ఆందోళనలు చెయ్యాలని ప్రతిపాదిస్తున్నామన్నారు. బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి మారయ్య మాట్లాడుతూ.. సీఐటీయూ సరైన సమయంలో స్పందించి ఈ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి నందున అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. విశేష అనుభవం కలిగిన కార్మిక సంఘాల ప్రాతినిధ్యం లేకుండా కోటి మంది కార్మికుల ప్రయోజనాలు ఎలా కాపాడతారో ప్రభుత్వం చెప్పాలని, సమావేశంలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆమోదిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో టీయూసీఐ నాయకులు ప్రవీణ్, ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఐఎన్‌టీయూ అధ్యక్షులు ఐ.కృష్ణ, తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ జాయింట్ సెక్రటరీ ఎ.నాగేశ్వరరావు పాల్గొని తీర్మానాన్ని బలపరుస్తూ ప్రసంగించారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఈశ్వర్‌రావు పాల్గొని మద్దతు తెలిపారు. చర్చల అనంతరం ఏ యూనియన్‌లకు ఆ యూనియన్‌లు డిసెంబర్ 21 వరకు వినతిపత్రాలు ఇవ్వాలని, డిసెంబర్ 23న హైదరాబాద్‌లోని కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఉమ్మడి వినతి పత్రాలు అధికారులకు అందజేయాలని తీర్మానించారు. ధర్నా అనంతరం తదుపరి కార్యాచరణ నిర్ణయిస్తామని ప్రకటించారు.

# పెండింగ్ బకాయిలు చెల్లించాలి

**– రాష్ట్రప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాట తప్పితే పోరాటాలను ఉధృతం చేస్తాం**

**– మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో పలు జిల్లాల్లో కలెక్టరేట్ల ఎదుట ధర్నా**



మధ్యాహ్న భోజన కార్మికులకిచ్చే గౌరవ వేతనం, విద్యార్థులకిచ్చే మెనూ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయనీ, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 48 గంటల నిరసన దీక్షలను కలెక్టరేట్ల ఎదుట నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికులకు కాంగ్రెస్ పార్టీ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కనీస వేతనం రూ.10 వేలు చెల్లించాలని, లేకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కోశాధికారి కె.ఉన్నికృష్ణన్ మాట్లాడుతూ.. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి ప్రభుత్వానికి ఎదురు పెట్టుబడి పెట్టి, విద్యార్థులకు వంట చేసి పెడుతున్నామని తెలిపారు. దాంతో కార్మికులు అప్పులపాలౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో కార్మికులు ధర్నా చేపట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని కలెక్టరేట్ ఎదుట దీక్షను ప్రారంభించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాచారి మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాల్లో రూ.10 వేల వేతనం అమలుపై ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు.

# ఫీజు రూ.1000 నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

**– ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్ మూర్తి**

**– ఓయూ కంట్రోలర్ కార్యాలయం ఎదుట విద్యార్థుల ధర్నా**



ఓయూ: ఓయూ పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులకు పరీక్ష ఫీజుతో పాటు ఫెయిల్ అయిన ప్రతి పేపర్‌కూ రూ.1000 చెల్లించాలనే నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు, ఓయూ పరిశోధక విద్యార్థి ఆర్.ఎల్ మూర్తి డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఓయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పేపర్‌కూ వెయ్యి రూపాయలు అంటే పేద విద్యార్థులు ఎలా కట్టగలరని ప్రశ్నించారు. యూనివర్సిటీ పరీక్ష షెడ్యూలు ప్రకటించినప్పుడు ఒక నిర్ణయం తర్వాత మరొక నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల కాక ముందే పరీక్ష ఫీజు చివరి తేదీ పెట్టడం విద్యార్థులను నష్టపరచడమేనని, తక్షణమే రీవాల్యుయేషన్ ఫలితాలను ప్రకటించాలని కోరారు. అలాగే, పరీక్ష ఫీజు తేదీని పొడిగించాలని డిమాండ్ చేశారు. కంట్రోలర్ ప్రొఫెసర్ శశికాంత్ వచ్చి విద్యార్థులతో మాట్లాడి సానుకూలంగా స్పందించడంతో ధర్నా విరమించారు. ఆయనకు వినతిపత్రం అందజేశారు.

# జూలపల్లికి వెంటనే రోడ్డు వేయలి

**– లేనిపక్షంలో ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తాం**

**– గ్రామస్తుల పాదయాత్ర**

**– తెలంగాణ రైతు సంఘం, సీపీఐ(ఎం) మద్దతు**




మహ్మదాబాద్: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని, జూలపల్లికి వెంటనే రోడ్డు వేయాలని, లేదంటే ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. సీపీఐ(ఎం), గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండలం జూలపల్లి గ్రామం నుంచి నంచర్ల గేట్ వరకు ప్రజాపాదయాత్ర నిర్వహించారు. ప్రజాపాదయాత్రకు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ.రాములు మద్దతు తెలిపి పాల్గొన్నారు. జూలపల్లి గ్రామానికి బీటీ రోడ్డు 15 సంవత్సరాల కిందట వేశారని, అది గుంతలమయంగా మారిందని, తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. నంచర్ల నుంచి జూలపల్లి మీదుగా కిష్టంపల్లి, గౌండ్యల, వేపూర్ గ్రామాలకు వెళ్లడానికి ఇదే రోడ్డని తెలిపారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే బీటీ రోడ్డు వేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని, కానీ సంవత్సరమవుతున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే రోడ్డు వేయాలని, లేదంటే ఎమ్మెల్యే ఇంటిని, కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గుండుమల్ల నర్సింలు, జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య, గ్రంథాలయం మాజీ చైర్మెన్ గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ కిరణ్ కుమార్ రెడ్డి, బాల్ రెడ్డి, బోయిని రాజు, జూలపల్లి గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లకు స్థిర వేతనం చెల్లించాలి

**– సంఘం రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి .. ఆసిఫాబాద్, మంచిర్యాలలో బస్సు జాత**




ఆసిఫాబాద్, మంచిర్యాల: రానున్న ఫిబ్రవరి బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్లకు గతంలో ఇచ్చిన హామీ మేరకు స్థిర వేతనం రూ.18వేలు నిర్ణయించాలని ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యలపై నిర్వహిస్తున్న బస్సు జాత సోమవారం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో కొనసాగింది. ఉదయం జాత ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి చేరిన సందర్భంగా స్థానిక ఆరే సంక్షేమ సంఘ భవనంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆశా వర్కర్లకు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తోందన్నారు. ఆశాలకు వేతనాలు పెంచడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిందని గుర్తు చేశారు. ఇప్పటికే వారి సమస్యలపై ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లడంతోపాటు నిరంతరం వివిధ రూపాల్లో పోరాటాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అయినా, కాంగ్రెస్ ప్రభుత్వం చలనం లేనట్టు వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 19 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న ఆశా వర్కర్లందరూ బడుగు బలహీన వర్గాలకు చెందిన వారేనన్నారు. ప్రతిరోజూ ఉదయం నుంచి రాత్రి వరకు పనిలో ఉండాలని, లేకపోతే పారితోషికాలు తగ్గించి రాస్తామని అధికారులు బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రసవాల సందర్భంగానైతే 2, 3 రోజులు కుటుంబాన్ని వదిలి హాస్పిటల్ వద్ద ఆశాలు పడిగాపులు కాయాల్సి వస్తోందన్నారు. ఈ పరిస్థితులన్నింటి నుంచి వారికి పరిష్కారం చూపాలని, వేతనం పెంచాలని కోరుతూ ఈనెల 15న ప్రారంభమైన బస్సు జాత 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతుందని చెప్పారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆశాలకు ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బస్సు జాత బృందం సభ్యులు ఎం.బాలమణి, ఎన్.పద్మ, ఆర్.సాధన, పి.గంగామణి, ఆర్.నీలాదేవి, కె.సునీత, యూనియన్ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు స్వరూప, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజేందర్, ముంజం శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి, మంచిర్యాల జిల్లా ఆశా యూనియన్ నాయకులు సమ్మక్క, దాసరి రాజేశ్వరి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంకె రవి, రంజిత్‌కుమార్, ఉపాధ్యక్షులు గూమాస ప్రకాష్ పాల్గొన్నారు.

# మధ్యప్రదేశ్ – హైదరాబాద్‌కు పప్పి స్ట్రా సరఫరా

**– అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్ వివరాలు వెల్లడించిన రాచకొండ సీపీ డా.సుధీర్‌బాబు**

**– మోహన్‌బాబుపై చట్టప్రకారం చర్యలని వెల్లడి**



హయత్ నగర్: పాపులర్ అయిన పప్పి స్ట్రా (గసగసాల గడ్డి)ని రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను ఎల్‌బీనగర్ ఎస్‌వోటీ పోలీసులు, మీర్‌పేట్ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశంలో రాచకొండ సీపీ డా.సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో గంజాయి సరఫరా తగ్గింది. ఇప్పుడు పప్పి స్ట్రా పాపులర్ అయింది. మాదకద్రవ్యాల సరఫరాతోపాటు పాత నేరస్థుల కదలికలపై పోలీసులు ప్రత్యేక నిఘా వేశారు. పప్పిస్ట్రా సరఫరా చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారంతో రాజస్థాన్‌కు చెందిన ఆరుగురు అంతర్రాష్ట్ర డ్రగ్స్ వ్యాపారులను పట్టుకుని డ్రగ్స్ రాకెట్‌ను ఎస్‌వోటీ, మీర్‌పేట్ పోలీసులు ఛేదించారు. రాజస్థాన్‌కు చెందిన మంగీలాల్ అలియాస్ మంగిలాల్ బిసోనీ నాదర్‌గుల్‌లో నివసాముంటున్నాడు. అతను గతంలో హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి కేసులో అరెస్టయ్యాడు. అదే రాష్ట్రానికి చెందిన మరో మంగీలాల్ అలియాస్ మంగీలాల్ ధాకా, భైరరామ్, రాజస్థాన్‌కు చెందిన శంకర్‌లాల్, శర్వన్ స్టీల్ రైలింగ్ పనులు, వ్యవసాయం చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. అయితే, ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో వీరు ఒక ముఠాగా ఏర్పడి నార్కోటిక్ డ్రగ్స్ విక్రయించడం ద్వారా సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన పింటూను పరిచయం చేసుకుని అతని వద్ద నుంచి తక్కువ ధరకు గసగసాల డ్రగ్‌ను కొనుగోలు చేస్తున్నారు. ఆ డ్రగ్స్‌ను ప్రజా రవాణా వాహనాల ద్వారా (రైలు, బస్సులు, లారీ మొదలైనవి) హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. శివారు ప్రాంతంలో అవసరమైన వారికి, తెలిసిన వారికి అధిక ధరలకు డ్రగ్స్‌ను విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆరుగురిని పట్టుకున్నారు. నిందితుల నుంచి 53.5 కిలోల గసగసాల గడ్డితోపాటు 3 మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్‌లో వాటి విలువ రూ.1.25కోట్లకుపైగా ఉంటుంది. పరారీలో ఉన్న నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

# మహారాష్ట్ర చిరుతపులులను అడ్డుకునేందుకు త్వరలో సమావేశం

**– మంత్రి కొండా సురేఖ**



హైదరాబాద్: మహారాష్ట్ర నుంచి వస్తున్న చిరుతపులులు దాడులు చేయకుండా అడ్డుకునేందుకు తీసుకోవా ల్సిన చర్యల్లో భాగంగా త్వరలో సమావేశమై చర్చించనున్నట్టు అటవీశాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సందర్భంగా రాష్ట్రంలో టైగర్ రిజర్వుల గురించి సభ్యులు టి.జీవన్ రెడ్డి తదితరులు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానమిచ్చారు. అటవీ ప్రాంతంలో నివసించే ప్రజలను బలవంతంగా తరలించడం లేదని స్పష్టం చేశారు. వన్యప్రాణులను కాపాడుతూనే, అటవీ జంతువుల బారిన పడకుండా అక్కడ నివసిస్తున్న వారి కోసం చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఎకో టూరిజం పాలసీకి సంబంధించి శాఖాపరమైన పని పూర్తయిందనీ, ప్రస్తుతం ముఖ్యమంత్రి వద్ద పెండింగ్‌లో ఉందని తెలిపారు. ప్రతి జిల్లా కేంద్రంలో బీసీ భవనాల నిర్మాణానికి సంబంధించిన మరో ప్రశ్నకు మంత్రి పొన్నం ప్రభాకర్ బదులిస్తూ, బీఆర్ఎస్ పదేండ్లలో బీసీలకు రూ.8000 కోట్లని చెప్పి, రూ.2000 కోట్లకు మంజూరునిచ్చి, రూ.800 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ సభ్యులు టి.రవీందర్ రావు మాట్లాడుతూ 57 ఏండ్లలో కాంగ్రెస్ బీసీలకు ఏం చేసిందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ తక్కువ కాలంలోనే ఎంతో చేసిందని చెప్పారు. బీఆర్ఎస్ సభ్యులు మధుసూదనాచారి మాట్లాడుతూ బీఆర్ఎస్ బీసీలకు ఎంతో చేసిందనీ, ఒక కుల భవనానికి ఇచ్చిన స్థలం విలువ రూ.200 కోట్లు (మార్కెట్ ధర) అని చెప్పారు. అదే స్థలం కోసం కాంగ్రెస్‌కు ఎన్ని వినతి పత్రాలిచ్చినా ప్రయోజనం లేకపోయిందని చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రెసిడెంట్, వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రతిపక్ష నాయకులు ఇలా అన్ని పదవులు ఒకే సామాజిక వర్గానికి ఇచ్చారనీ, కాంగ్రెస్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అధిక ప్రాధాన్యత ఉ ఒదన్నారు. కాంగ్రెస్ సభ్యులు టి.జీవన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేస్తున్న ఉద్యోగాలు కాకుండా మరో 2 లక్షల వరకు ఖాళీలున్నాయనీ, వాటిని భర్తీ చేయాలని కోరారు. బీఆర్ఎస్ సభ్యులు కల్వకుంట్ల కవిత, ఎం.ఎస్.ప్రభాకర్ రావు మాట్లాడుతూ ఉర్దూ మీడియంలో రిజర్వ్ పోస్టులను డీరిజర్వ్ చేయొద్దని సూచించారు. ఆయా వర్గాలు అర్హత పొందేలా ప్రోత్సహించాలని సూచించారు. సభ్యులు తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ ఈడబ్ల్యూఎస్ కోటా 10 శాతం అమలుతో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈడబ్ల్యూఎస్ కోటాను ఫిక్స్ చేసే అవకాశముందా? పరిశీలించాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ జాబ్ క్యాలెండర్ ప్రకటించి ప్రణాళికాబద్ధంగా ఖాళీలను భర్తీ చేస్తున్నట్టు వివరించారు. బీఆర్ఎస్ సభ్యులు రమణ మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 20 నుంచి డిసెంబర్ 13 వరకు రాష్ట్రంలో 28 మంది నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బతుకమ్మ చీరలు ఆపడంతో మళ్లీ ఆత్మహత్యలు పెరిగాయని తెలిపారు. వీటి నివారణకు చర్యలు తీసుకోవాలనీ, హామీ మేరకు కేంద్రం విధిస్తున్న జీఎస్టీని రాష్ట్రం భరించాలని డిమాండ్ చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, గత ప్రభుత్వం బకాయిపెట్టిన వాటికి చెల్లింపులు చేస్తున్నామనీ, త్వరలోనే నేతన్నల రుణమాఫీ ఉంటుందని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి వెళ్లే తెలంగాణ భక్తుల నుంచి అధిక ఆదాయం వస్తున్నా, మునపటిలా తెలంగాణ భక్తులకు, ప్రజా ప్రతినిధులకు తగిన గౌరవం, గుర్తింపు దక్కడం లేదని మండలి చైర్మెన్ సహా పలువురు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ సమాధానమిస్తూ, ఇప్పటికే ఏపీ ప్రభుత్వం, టీటీడీ చైర్మెన్‌తో ఈ విషయాలు తెలిపామనీ, మరిన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. గతంలో వచ్చినట్టు టీటీడీ తెలంగాణ దేవాలయాలకు నిధుల కేటాయింపు కూడా తగ్గించిందని చెప్పారు.

# గురుకుల హాస్టల్లో ఎలుకల బెడద

**– ఐదుగురు విద్యార్థినులను కరిచిన ఎలుకలు**

కీసర: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మహాత్మా జ్యోతిబాపూలే బాలికల హాస్టల్‌లో ఎలుకలు స్వైర విహారం చేస్తున్నాయి. ఆదివారం రాత్రి విద్యార్థులు నిద్రించే సమయంలో ఐదుగురిని ఎలుకలు కరిచాయి. హాస్టల్ సిబ్బంది, ప్రిన్సిపాల్ మహాలక్ష్మి కలిసి విద్యార్థులను కీసర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం బయటకు పొక్కకుండా విద్యార్థులకు చికిత్స అందిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా సమాచారం ఇవ్వలేదని సమాచారం.

దీనిపై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా, విద్యార్థులకు దద్దుర్లు, దురదలు వచ్చాయని, అందుకే ఆస్పత్రి తీసుకొచ్చామని చెప్పారు. ఎలుకలు కరిశాయనేది తప్పుడు ప్రచారం అన్నారు. అయితే, గురుకుల పాఠశాలలో విద్యార్థులను ఎలుకలు కరిచాయని, వారికి చికిత్స అందించినట్టు కీసర ప్రభుత్వాస్పత్రి వైద్యులు తెలపడం గమనార్హం.

# ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



ఖమ్మం : ప్రజావాణిలో వచ్చిన వినతులను సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు.ఖమ్మం మదీన మసీదు అధ్యక్షుడు ఎం.డి. హకీం ముస్తఫా నగర్ ఏరియాలోని మైనారిటీలకు ఖబరస్తాన్ ఏర్పాటుకు భూమి కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఖమ్మం అర్బన్ తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కల్లూరు మండలం చెన్నూరు గ్రామానికి చెందిన చింతలపాటి చెన్నారావ్ మన ఊరు మన బడి పథకం క్రింద తల్లాడ మండలం కుర్నవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు 45 లక్షల విలువ గల పనులు చేశానని, అందులో 10 లక్షల వరకు బిల్లులు పెండింగ్ లో ఉన్నాయని, త్వరగా ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా విద్యా శాఖ అధికారికు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ముదిగొండ మండలం వల్లభి గ్రామానికి చెందిన కృష్ణవేణి వల్లభి గ్రామం నందు అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ టీచర్ పోస్ట్ ఖాళీ అయినందున ఎస్టి కులస్తురాలైన తనకు అవకాశం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా సంక్షేమ అధికారికి రాస్తూ నిబంధనల ప్రకారం పరిశీలించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. తల్లాడ గ్రామానికి చెందిన ఈలప్రోలు అంజలి ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకోగా, ఈఈ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రజావాణిలో డిఆర్డీవో సన్యాసయ్య, డిఆర్వో ఎం. రాజేశ్వరి, కలెక్టరేట్ ఏ.ఓ. అరుణ, జిల్లా అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కప్ పోటీలతో వెలుగులోకి క్రీడాకారులు

- జిల్లా క్రీడాకారులు
- రాష్ట్ర పోటీల్లో సత్తా చాటాలి
- సీఎం కప్ 2024 జిల్లా స్థాయి పోటీల ప్రారంభోత్సవంలో
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
- అట్టహాసంగా ప్రారంభమైన సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలు..

కరీంనగర్: చీఫ్ మినిస్టర్స్ కప్ 2024 పోటీలతో గ్రామీణ ప్రాంతాల్లోని మెరికల్ లాంటి ఎందరో క్రీడాకారులు వెలుగులోకి వస్తారని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియంలో సోమవారం ప్రారంభమైన జిల్లాస్థాయి సీఎం కప్ పోటీలను ఆమె లాంఛనంగా ప్రారంభించారు. అంతకు ముందు ఆమె జ్యోతి ప్రజల చేసి, ఒలంపిక్ క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి, క్రీడాజ్యోతిని వెలిగించి, గాలిలో బేలూన్ లను వదిలిపెట్టి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. గ్రామస్థాయి నుంచి ప్రారంభించిన సీఎం కప్ పోటీలకు క్రీడాకారుల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. క్రీడాకారులు సీఎం కప్ పోటీలను సద్వినియోగం చేసుకొని రాణించాలన్నారు. రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో జిల్లా జట్లు అద్వితీయ ప్రతిభ కనబరిచి చాంపియన్గా ఎదిగి జిల్లా పేరును నిలుపాలని సూచించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తున్నదని అందులో భాగంగానే సీఎం కప్ క్రీడలను పంచాయితీ స్థాయి నుంచి నిర్వహించడం గర్వకారణమన్నారు. గ్రామం నుంచి ప్రపంచానికి విజేతల రూపకల్పన అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా క్రీడలను నిర్వహిస్తుందన్నారు. త్వరలోనే క్రీడా రంగాన్ని అభివృద్ధి పరిచేందుకు నూతన క్రీడా పాలసీని సైతం రూపొందిస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్ డివైఎస్ఓ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కోకో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, జూడో, బేస్ బాల్, అర్చరి పోటీల్లో తొలి రోజున నిర్వహించగా సుమారు 2000 మందికి పైగా క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో రాణించిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఒలంపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో క్రీడలకు తలమానికంగా కరీంనగర్ జిల్లా నిలుస్తుందన్నారు. సీఎం కప్ క్రీడల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం కలెక్టర్ రన్నింగ్ పోటీలను జండా ఊపి ప్రారంభించారు. కోకో క్రీడాకారులను పరిచయం చేసుకొని కోకో పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, స్థానిక కార్పొరేటర్ సర్దార్ రవీందర్ సింగ్, ఒలంపిక్ సంఘం అధ్యక్షులు నందలి మహిపాల్, ఉపాధ్యక్షులు తుమ్మల రమేష్ రెడ్డి, కోశాధికారి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, ఎస్ జి ఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, పేట అధ్యక్ష కార్యదర్శులు అంతడుపుల శ్రీనివాస్, ఎండి యూనిస్ పాషా, సొల్లు సారయ్య, అంతటి శంకరయ్య, ఎస్ సారయ్య వివిధ క్రీడా సంఘాల బాధ్యులు, క్రీడాకారులు వ్యాయామ ఉపాధ్యాయులు కోచులు మేనేజర్లు మండల కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

# పోకిరీలు వేధిస్తే నేరుగా షీ టీంకు ఫోన్ చేయాలి



కమాన్ పూర్: రోడ్లపై పోకిరీలు వేధిస్తే నేరుగా షి టీంకు ఫోన్ చేయాలి అని ఇన్చార్జి స్నేహలత అన్నారు. రామగుండం సి.పి ఆదేశాల మేరకు, సుల్తానాబాద్ లోని వివేకానంద హై స్కూల్ మరియు కాలేజీ విద్యార్థులకు షీ టీం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. అందులో భాగంగా షీ టీం ఇంచార్జ్ ఏ ఎస్ ఐ మల్లన్న మాట్లాడుతూ మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు ఆంటీ డ్రగ్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందని , ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు ,లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదంఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు.మరియు ఆక తాయిల నుండి ఎలా రక్షణగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో షి టీమ్ సభ్యురాలు స్నేహలతమరియు కరెస్పాండంట్ రవీందర్, ప్రిన్సిపాల్ సాయికిరణ్ మరియు ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల బలం, బలగం టీయూడబ్ల్యూజే (ఐజేయూ)

- జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఇరంతర పోరాటం
- టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షులు బుర్ర సంపత్ కుమార్



గోదావరిఖని: జర్నలిస్టుల బలం, బలగం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) అని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటం చేస్తామని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు బుర్ర సంపత్ కుమార్ అన్నారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో యూనియన్ సభ్యత్వాన్ని ఐజేయూ జాతీయ కౌన్సిల్ మెంబర్ ఎం. వంశీ, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కోల లక్ష్మణ్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పూదరి కుమార్, ప్రధాన కార్యదర్శి పందిళ్ళ శ్యామ్ సుందర్ లతో కలిసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆరంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరికొద్ది రోజుల్లో యూనియన్ మూడవ జిల్లా మహాసభను నిర్వహించనున్న సందర్భంగా జిల్లావ్యాప్తంగా సభ్యత నమోదు కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. మహాసభ రోజున జిల్లా నూతన కార్యవర్గాన్ని కి ఎన్నికలు ఉన్నామని తెలిపారు. క్రమశిక్షణ గల సంఘం టీయూడబ్ల్యూజే ఉందని అన్నారు. 40 ఏళ్లుగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం, సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేస్తున్న ఏకైక సంఘం అని గుర్తు చేశారు. గత పది సంవత్సరాలుగా జిల్లాలో జర్నలిస్టులకు ఇండ్లు, ఇళ్ల స్థలాల కోసం పోరాటం చేస్తూనే ఉన్నామని, కానీ ఇప్పటివరకు ఆ సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. ఇటీవల పెద్దపల్లి లో జరిగిన యువ వికాసం బహిరంగ సభకు హాజరైన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లాకు చెందిన రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణారావు, రాజ్ ఠాగూర్ మక్కాన్ సింగ్ కు వినతి పత్రాలు అందజేశామని తెలిపారు. మరికొద్ది రోజులు తమ సమస్యలు పరిష్కారం కోసం వేచి చూస్తామని, ఆలోపు పరిష్కారం కాకపోతే పోరాటం చేయక తప్పదని అన్నారు. ఆ పోరాటానికి జర్నలిస్టులంతా సిద్ధంగా ఉండాలని కోరారు. ఐజేయు జాతీయ కౌన్సిల్ మెంబర్ వంశీ మాట్లాడుతూ ,జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరంగా పోరాటం చేసే యూనియన్ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) అని అన్నారు. జర్నలిస్టులకు అండగా నిలుస్తున్నదని తెలిపారు. జర్నలిస్టులంతా ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు సభ్యత్వం తీసుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కోల లక్ష్మణ్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న జర్నలిస్టులకు ఇండ్లు, ఇళ్ల స్థలాల కోసం పదిహేనుగా పోరాటం చేస్తున్నామని, గత ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైన ఇండ్లు ఇళ్ల స్థలాలు మంజూరు చేయకుంటే విస్తృత పోరాటం చేస్తామని ఆయన అన్నారు.ఈ సభ్యత నమోదు కార్యక్రమంలో, జిల్లా ఉపాధ్యక్షులు పాలకుర్తి విజయ్ కుమార్, దాడుల నివారణ కమిటీ కన్వీనర్ సిపెల్లిరాజేశం జాయింట్ సెక్రటరీ జక్కం సత్యనారాయణ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీలు, కేవీస్ వాస్.సురభి శ్రీధర్, మెంబర్స్ దబ్బెట శంకర్ , కొండల్ రెడ్డితోపాటు, పాత్రికేయులు దయానంద్ గాంధీ, వడ్డేపల్లి దినేష్, సిహెచ్ రాజేష్, మాటేటి శ్రీనివాస్, బొల్లం మధు, మామిడి అశోక్, కే. శంకర్, ఎం. శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ సీనియర్లు...వాయిస్ పెంచుతున్నారే

మెదక్: ఒకప్పుడు తెలంగాణ కాంగ్రెస్.. వర్గ విభేదాలకు పుట్టినిల్లు. పార్టీలో ఎవరి దారి వాళ్లదే. ఎవరి నిర్ణయం వాళ్లదే. టికెట్ల నుంచి పదవుల పంపకాల వరకు ఎప్పుడూ ఏదో ఒక రచ్చ. ఇదే కాంగ్రెస్కు ఉన్న పెద్ద మచ్చ. తమ వర్గానికి చెందిన వారికి టికెట్లు రాలేదని.. పదవులు దక్కలేదని.. ఎప్పుడూ ఏదో ఇష్యూతో ఇంటిపోరు ఉండేది. కొన్నిసార్లు అయితే.. గల్లీ లొల్లి ఢిల్లీ దాకా వెళ్లేది. ఆ సందర్భంలో నేతల్ని సముదాయించడం హైకమాండ్కు పెద్ద తలనొప్పిగా మారేది.కానీ రేవంత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నేతల్లో మార్పు వచ్చినట్లు కనిపించింది. సీఎం సీటు కోసం పదుల సంఖ్యలో సీనియర్లు ప్రయత్నాలు చేసినా.. అధిష్టానం నిర్ణయానికే కట్టుబడి ఉన్నారు. మంత్రి పదవుల పంపకాల్లో, ఎంపీ టికెట్ల పంపకాల్లోనూ ఎక్కడ అసంతృప్తి గళం వినబడలేదు. కనబడలేదు.ఏడాది కాలంగా.. కాంగ్రెస్ నేతలందరిది ఒక్కటే స్వరం.. ఒక్కటే మార్గం. అధిష్టానం చెప్పిందే చేశారు. పెద్దలకు నచ్చిందే చేశారు. సమిష్టి కృషికి సంపూర్ణ అర్థమిచ్చేలా మెదిలారు. గ్రూప్ తగదాలకు చెక్ పెట్టి.. ప్రతిపక్షాలను ఎదుర్కోవడంలో ఫుల్ సక్సెస్ అయ్యారు. జగిత్యాల సెంటర్లో వలసల లొల్లి సలసలా కాగినట్లు కనిపించినా టీకప్పులో తుఫానులా సమసిపోయింది.. ఆ సమయంలోనూ పార్టీ ముఖ్య నేతలంతా ఒక్కతాటిపైకి వచ్చి జీవన్రెడ్డిని బుజ్జగించి ఇది మారిన కాంగ్రెస్ అనుకునేలా చేశారు..ఐతే ఏడాది ఐకమత్యానికి ఎక్కడో బ్రేక్ పడినట్లు కనిపిస్తోంది.. తెలంగాణ కాంగ్రెస్లో విభేదాలకు చెక్ పడిందని అందరూ డిసైడ్ అయిన వేళ మళ్లీ అసంతృప్తి స్వరాల గర్జన వినిపిస్తోంది.. మళ్లీ లొల్లి ట్రాక్ ఎక్కింది. ఇన్నాళ్లు నిశ్శబ్దంగా ఉన్న సీనియర్లు.. నివురుగప్పిన నిప్పు కణికలని తేలిపోయింది. సీనియర్లు ఒక్కొక్కరు సొంత స్వరం వినిపిస్తున్నారు.ఏ నిర్ణయం తీసుకున్నా? తల ఊపేది లేదు. ఊరుకునేదే లేదని తేల్చిచెబుతున్నారు.. తాజాగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి రూపంలో జగడం మొదలైంది. అసలే జగ్గారెడ్డి. ఏ విషయాన్నైనా ముక్కుసూటిగా చెప్పేస్తారు. నచ్చకపోతే సొంత పార్టీ నేతల్నే నిలదీసే తత్వం ఆయన సొంతం. ఐతే ఇన్నాళ్లు సైలెంట్గా ఉన్న జగ్గారెడ్డి సడెన్గా పార్టీ నేతలకు వ్యతిరేకంగా స్వరం వినిపించారు. కాంగ్రెస్ను చంపేస్తారా అంటూ జాతీయ నాయకులపై విరుచుకుపడ్డారు.ఐతే జగ్గారెడ్డి ఇంతలా ఫైర్ అవడానికి కారణం కేబినెట్ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ వ్యవహారమేనన్నది ఇన్సైడ్ టాక్.. తెలంగాణ వచ్చాక పదేళ్లు పదవులకు దూరంగా ఉంటూ.. పార్టీని కాపాడుకుంటూ వచ్చిన వారిని కాదని పదవుల పంపకాలు జరుగుతున్నాయనేది ఆయన ఆవేదన అంట.. పదవుల పందేరంలో పై స్థాయిలో ఉన్న ఇద్దరు, ముగ్గురు నేతలే డిస్కస్ చేసుకొని నిర్ణయాలు తీసుకుంటున్నారనేది ఆయన ఆగ్రహానికి కారణమంట.ఇదే విషయాన్ని ఓ ఫంక్షన్లో ఎదురుపడిన పార్టీ సహ ఇన్ఛార్జి విష్ణునాథ్ను జగ్గారెడ్డి పట్టుకొని నిలదీశారని, పార్టీ గ్రౌండ్ లెవల్లో ఏం జరుగుతుందో తెలుసుకోకుండా నిర్ణయాలు తీసుకుంటారా? మీకు మీరే డిసైడ్ అయితే మేమేందుకు అని కూడా ప్రశ్నించారనేది గాంధీ భవన్లో రీసౌండ్ చేస్తున్న గాసిప్..ఏడాది నుంచి ఊరిస్తూ ఉసూరుమనిపిస్తున్న పోస్టులు ఇప్పుడు అందకుండా పోతే ఆశావాహుల అసంతృప్తి మరింత పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.. మరి ఇంటి పంచాయితీని పార్టీ పెద్దలు ఎలా డీల్ చేస్తారు.. సీనియర్ల పాయింట్ ఆఫ్ ఆర్డర్ను హైకమాండ్ పట్టించుకుంటుందా? లైట్ తీసుకుంటుందా? అనేది వేచి చూడాలి.

# సింగరేణిలో ఉన్న పెండింగ్ ఉద్యోగాలను పరిష్కరించాలి



కమాన్ పూర్: సింగరేణి కంపెనీలో పెండింగ్లో ఉన్న విజిలెన్స్ డిపెండెంట్ ఉద్యోగాలు పరిష్కరించాలి కేంద్రమంత్రి బొగ్గు గని శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకుపోతాం అని రామగిరి మండలం సెంటనరి కాలనీలో బిజెపి అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా సింగరేణిలో పెండింగ్లో ఉన్న విజిలెన్స్ కేసులో పరిష్కరించాలని లేనిపక్షంలో వీరందరిని తీసుకుని కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్తామని కొన్ని సంవత్సరాలుగా కార్మిక కుటుంబాలు రోడ్డు మీద పడుతున్న కూడా సింగరేణి కంపెనీ వీరుని పట్టించుకోకపోవడం బాధాకరం గత కొన్ని సంవత్సరాలుగా ఉద్యోగాలు లేక కుటుంబాలు రెక్క ఆడితే కానీ డొక్కాడని పరిస్థితికి వచ్చాయి అయినా కూడా సింగరేణి అధికారులు కార్మికుల గోడు వినడం లేదు కుమారుని కు లేక అల్లుడికో కూతురుకు ఉద్యోగమిద్దామనుకొని మెడికల్ అన్ ఫిట్ అయిన తర్వాత కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం ఇవ్వమంటే సింగరేణి కంపెనీ మీ పేర్లు తప్పు ఉన్నాయని మీ కులాలు వేరు ఉన్నాయని వారిని ఇబ్బంది చేస్తూ ఉద్యోగం ఇవ్వడం లేదు మరియు లేనిపక్షంలో 25 లక్షల రూపాయలు కూడా ఇవ్వకుండా కార్మిక కుటుంబాలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి సింగరేణి యాజమాన్యం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అధికారుల తీరు మారడం లేదు గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ విజిలెన్స్ కేసులో పరిష్కరించాలని చెప్పినా కూడా వాళ్లు మాట వినలేదు. ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఐ ఎన్ టి సి నాయకులు కూడా ఈ యొక్క సమస్యను పరిష్కరించడం లేదు వీరి సమస్యను పరిష్కరించకపోతే విజిలెన్స్ కేసులో ఉన్న కార్మిక కుటుంబ సభ్యులందరిని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి దగ్గరకు తీసుకువెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలాగా చూస్తాం అన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు బిజెపి మొలుమూరి శ్రీనివాస్ బిజెపి సీనియర్ నాయకులు మెరుగు శ్రీకాంత్ కందుల రమేష్ అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

# బీమా రంగంలో ఎఫ్డీఐని అనుమతించొద్దు

- హెచ్ఆర్ జీఐఈఏ జనరల్ సెక్రెటరీ వై.సుబ్బారావు
- యునైటెడ్ ఇన్సూరెన్స్ కార్యాలయం ఎదుట నిరసన




హిమాయత్నగర్: బీమా రంగంలో వందశాతం ఎఫ్డీఐని అనుమతించాలనే ప్రతిపాదనను వెంటనే ఉపసంహ రించుకోవాలని హెచ్ఆర్ జీఐఈఏ జనరల్ సెక్రెటరీ వై.సుబ్బారావు డిమాండ్ చేశారు. బీమా రంగంలో వంద శాతం ఎఫ్డీఐకి వ్యతిరేకంగా, పీఎస్ జీఐసీఎస్ విలీనం, బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం హైదరాబాద్ బషీర్బాగ్లోని యునైటెడ్ ఇన్సూరెన్స్ కార్యాలయం ఎదుట పలు ప్రభుత్వ రంగ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలు, యూనియన్లు, సంఘాల నాయకులు కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వై.సుబ్బారావు మాట్లాడుతూ ఎఫ్డీఐ పరిమితులను పెంచడం వల్ల దేశంలో బీమా వ్యాప్తి గణనీయంగా పడిపోయిందని తెలిపారు. బదులుగా ఎఫ్డీఐ ప్రవాహాలు ప్రధానంగా లాభదాయకంగా ఉంటాయని, భారతదేశ సామాజిక, ఆర్థిక అవసరాలను పరిష్కరించడం కంటే మూలధనం స్వదేశానికి వెళ్లడంపై దృష్టి సారించిందన్నారు. పబ్లిక్ సెక్టార్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీల విలీనం, అంతర్ కంపెనీ పోటీని తొలగించడానికి, రేటు తగ్గింపులను నిరోధించడానికి, కస్టమర్లు, ప్రజలకు మరింత సమర్థవం తంగా సేవ చేయడానికి ఒకే బలమైన ఏకశిల కార్పొరేషన్ను రూపొందించాలని డిమాండ్ చేశారు. తగిన మూలధనం, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన, సురక్ష బీమా యోజన, ఆయుష్మాన్ భారత్, జన్ ఆరోగ్య యోజన, ఇతర సారూప్య కార్యక్రమాల వంటి ప్రభుత్వ సామాజిక భద్రత పథకాల ద్వారా కార్యకలాపాలను విస్తరింప జేయాలని అన్నారు. సామాన్యులకు మెరుగైన సేవలను అందించాలని, ఇన్సూరెన్స్ మార్కెట్లో లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్ను నిర్ధారించడం, న్యాయమైన పోటీని కాపాడడానికి, ప్రభుత్వ రంగ బీమా కంపెనీల ప్రయోజనాలను నిలబెట్టడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ జీఐఈఏ ప్రెసిడెంట్ శీలం రాజు, సీనియర్ నాయకురాలు ఎన్.ఎస్.శైలజ, జీఐఈఏఐఏ జనరల్ సెక్రెటరీ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ-కుబేర్ పెండింగ్ బిల్లులు డిసెంబర్లోగా చెల్లించాలి

- అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రత్యేక ప్రస్తావన



హైదరాబాద్: డిసెంబర్లోగా ఈ-కుబేర్ పెండింగ్ బిల్లులన్నింటినీ చెల్లించే విధంగా మంత్రివర్గం నిర్ణయించి, చెల్లించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. సోమవారం శాసనమండలిలో ఈ అంశాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్ర ఉద్యో గులు, ఉపాధ్యాయులందరికీ ఈ-కుబేర్ పెండింగ్స్ 2022 ఆగస్టు నుంచి ఉన్నా యని తెలిపారు. 2022 జనవరిలో ప్రకటించిచన డీఏ ఎరియర్స్ కూడా ఇంకా పెండింగ్లో ఉన్నాయని చెప్పారు. 2023 డిసెంబర్ వరకు సగానికి పైగా బిల్లులు పెండింగ్లోనే ఉండిపోయాయని పేర్కొన్నారు. జీపీఎఫ్ లోను/ పార్ట్ ఫైనల్స్, సరెండర్ బిల్లులు, మెడికల్ రీ-యింబర్స్ మెంట్ బిల్లులు, డీఏ ఎరియర్స్తో పాటు 2024 మార్చి నుంచి రిటైర్ అయిన వారి పెన్షనరీ బెనిఫిట్స్ బకాయిలోనే ఉన్నాయన్నారు. ఈ పెండింగ్ బిల్లులన్నింటిని 2024 డిసెంబర్ లోగా చెల్లిస్తామని గతంలో జేఏసీకి చెప్పారని గుర్తుచేశారు.

## గాయం కారణంగా బీజీటీ సిరీస్‌కు స్టార్ పేసర్ దూరమయ్యే అవకాశం!

**- గబ్బా టెస్టులో గాయపడ్డ స్టార్ పేసర్ జోష్ హేజిల్‌వుడ్**

**- కుడి కాలు పిక్కలు పట్టేయడంతో మ్యాచ్ మధ్యలోనే మైదానం వీడిన బౌలర్**

**- బీజీటీ సిరీస్‌లో మిగిలిన మ్యాచ్‌లకు అతడు దూరమయ్యే అవకాశం ఉందన్న సీఏ**




ఆస్ట్రేలియా స్టార్ పేసర్ జోష్ హేజిల్‌వుడ్ గబ్బా వేదికగా జరుగుతున్న మూడో టెస్ట్‌లో గాయపడ్డారు. కుడి కాలు పిక్కలు పట్టేయడంతో అతడు మ్యాచ్ మధ్యలోనే మైదానం వీడారు. ఈ గాయం కారణంగా భారత్‌తో జరుగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో మిగిలిన రెండు మ్యాచ్‌లకు అతను దూరమయ్యే అవకాశం ఉందని క్రికెట్ ఆస్ట్రేలియా తెలిపింది. ఒకవేళ హేజిల్‌వుడ్ దూరమైతే ఆసీస్ బౌలింగ్ ఎటాక్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది.

బ్రిస్బేన్ టెస్టు మ్యాచ్‌లో హేజిల్‌వుడ్ కుడి కాలు పిక్కలు పట్టేయడంతో తీవ్ర ఒత్తిడికి గురయ్యాడని క్రికెట్ ఆస్ట్రేలియా తన అధికారిక ప్రకటనలో పేర్కొంది. "అతను మిగిలిన టెస్ట్ సిరీస్‌కు దూరమయ్యే అవకాశం ఉంది" అని తెలిపింది. మంగళవారం కెప్టెన్ పాట్ కమ్మిన్స్, స్టీవ్ స్మిత్, టీమ్ ఫిజియో నిక్ జోన్స్‌తో చర్చించిన తర్వాత హేజిల్‌వుడ్ మైదానం నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఈరోజు కేవలం ఒక ఓవర్ మాత్రమే బౌలింగ్ చేశాడు. హేజిల్‌వుడ్ గాయం తీవ్రతను తెలుసుకోవడానికి స్కానింగ్ కోసం తీసుకెళ్లినట్లు సీఏ తెలిపింది.

కాగా, సోమవారం నాడు ఓ అద్భుతమైన బంతితో భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని హేజిల్‌వుడ్ పెవిలియన్‌కు పంపిన విషయం తెలిసిందే. ఇక అడిలైడ్‌లో జరిగిన పింక్ బాల్ టెస్ట్‌కు కూడా గాయం కారణంగానే ఈ స్టార్ పేసర్ దూరమయ్యాడు. ఇప్పుడు మూడో టెస్టుకు పేసర్ స్కాట్ బోలాండ్ స్థానంలో తిరిగి జట్టులోకి వచ్చాడు.

## ఆపద్బాంధవుడు.. రాహుల్ కొత్త అవతారం..!

నవ్విన నాపచేనే పండుతుందన్న సామెత బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో కేఎల్ రాహుల్(%ఖూ ఘ్షబ్రశ్రీ%)కు అతికినట్లు సరిపోతుంది. గబ్బా మైదానంలో ప్రేక్షకులతో చప్పట్లు కొట్టించుకోవాలనుకోలేదు.. బౌలర్లను డామినేట్ చేయాలనుకోలేదు.. కేవలం నిలకడగా ఆడి జట్టును గండం గట్టెక్కించాలనుకున్నాడు. పరిస్థితులకు తగ్గట్లు ఆడి.. అనుకున్నది సాధించాడు. వాస్తవానికి న్యూజిలాండ్ సిరీస్‌కు స్క్వాడ్‌లో ఉన్నా.. బెంచ్‌కే పరిమితం అయ్యాడు. పరిమిత ఓవర్ల మ్యాచ్‌ల్లో పరుగుల కోసం అవస్థలు పడుతున్నాడు. మరోవైపు సర్ఫరాజ్ ఖాన్ వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొంటూ 150 పరుగులు చేయడంతో.. రాహుల్‌కు జట్టులో స్థానం ప్రశ్నార్థకంగా మారింది. ఆస్ట్రేలియా వికెట్లను దృష్టిలో పెట్టుకొని టీమ్ మేనేజ్‌మెంట్ అతడిపై నమ్మకముంచి బీజీటీలో కూడా కొనసాగించింది. ఈ సిరీస్‌లో తొలి టెస్ట్ రెండో ఇన్నింగ్స్ మినహాయించి భారత బ్యాటర్లు విఫలమవుతున్నా.. రాహుల్ ఒక్కడే ఆధారపడదగ్గ ఇన్నింగ్స్‌లు ఆడి పరువు కాపాడుతున్నాడు. తాజాగా ఆసీస్ కంచుకోట గబ్బాలో జట్టును ఫాలోఆన్ గండం గట్టెక్కించేందుకు విలువైన 84 పరుగుల ఇన్నింగ్స్ అందించాడు.

బంతిని పాతబడేట్లు చేసి..

కుకబుర్ర కొత్త బంతితో మైదానంలో కనీసం 20-30 ఓవర్లు బౌలింగ్ చేశాకే.. మెరుపు కోల్పోయి బ్యాటర్లకు అనుకూలిస్తుంది. అది పాతబడక ముందే భారత బ్యాటర్లు దూకుడుగా ఆడటంతో 30 ఓవర్లు గడిచేసరికి దాదాపు నాలుగైదు వికెట్లను భారత్ కోల్పోయింది. ఆసీస్ బ్యాటర్లు మాత్రం పరుగులు తక్కువ చేసినా.. బంతి పాతబడే వరకు ఓపిగ్గా ఎదురు చూస్తున్నారు. దీనికి స్మిత్ ఇన్నింగ్సే పెద్ద ఉదాహరణ. అర్ధశతకానికి 128 బంతులు ఆడాడంటే అర్థం చేసుకోవచ్చు. ఆ తర్వాత దానిని శతకంగా మలిచాడు. భారత్ వైపు వికెట్లు పడుతున్నా రాహుల్ మాత్రం ఓపిగ్గా ఎంపిక చేసిన బంతులనే షాట్లుగా మలిచాడు. నాలుగో రోజు స్మిత్ ఇచ్చిన జీవనదానాన్ని వాడుకొని విలువైన పరుగులు చేశాడు. అతడికి జడ్డూ కూడా తోడు కావడంతో భారత్ గౌరవ ప్రదమైన స్కోర్‌కు చేరి.. ఫాలో ఆన్ నుంచి బయటపడింది.



వారు చేసిన తప్పులు చేయకుండా..

గబ్బా టెస్ట్‌లో గిల్, విరాట్ పంత్, రోహిత్‌లు అనవసర షాట్లకు యత్నించి స్లిప్ లేదా వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యారు. ఆసీస్ బౌలర్ల ఆఫ్‌సైడ్ బంతులను మంచి ఫుట్ వర్క్‌తో ఎదుర్కొన్నాడు. కోహ్లీ, రోహిత్ ప్యాడ్ల వద్ద ఎదుర్కొన్నటు వంటి బంతులను రాహుల్ మాత్రం శరీరానికి దగ్గరగా ఆడటం గమనార్హం. బంతి శరీరం దగ్గరకు వచ్చేవరకు ఎదురు చూసి షాట్లు ఆడాడు.. అదే రోహిత్, కోహ్లీలు దీనికి భిన్నంగా చాలా ముందుగా బంతిని ఎదుర్కొనేందుకు యత్నించారు.

సెనా దేశాల్లో ఆ స్టార్ల కంటే అతడే బెటర్..

సీమర్లకు అనుకూలించే పిచ్‌లున్న సెనా దేశాల్లో (సౌతాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) వికెట్లపై 2020 నుంచి నిలకడగా రాణిస్తున్న రికార్డు రాహుల్‌కు ఉంది. ఓ రకంగా కోహ్లీ, పంత్, రోహిత్ సహా పలువురు బ్యాటర్లు నియంత్రణ కోల్పోయి షాట్లు ఆడి వికెట్లు కోల్పోయిన చోట్ల కూడా ఇతడు మెరుగ్గా ఆడాడు. తీవ్రమైన ఒత్తిడిలో కూడా అతడు స్కోర్‌బోర్డును కదిలించి ముందుకు తీసుకెళతాడనే పేరుంది. 2020 నుంచి సెనా దేశాల్లో రాహుల్ సగటు 41.5 కాగా.. విరాట్ (30.4), పంత్ (34.8), రోహిత్ (33.2)గా ఉంది. తాజాగా ఆడిన మూడు టెస్టుల్లో అతడే టీమ్ ఇండియా తరఫున టాప్ స్కోరర్.

## టీ బ్రేక్.. అంతా రవీంద్ర జడేజా పైనే భారం!

గబ్బా వేదికగా జరుగుతున్న మూడో టెస్టులో (%ూఖా జం ×చీణ%) భారత్‌కు 'ఫాలో ఆన్' గండం పొంచిఉంది. ఆ ప్రమాదం నుంచి బయటపడాలంటే రవీంద్ర జడేజా (65ి) మరికాసేపు క్రీజ్‌లో నిలవాల్సిందే. నాలుగో రోజు టీ బ్రేక్ సమయానికి టీమ్‌ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో 201/7 స్కోరుతో ఉంది. క్రీజ్‌లో జడేజాతోపాటు మహ్మద్ సిరాజ్ (1ి) ఉన్నాడు. ఫాలోఆన్ తప్పించుకోవాలంటే టీమ్‌ఇండియా ఇంకా 45 పరుగులు చేయాలి. వర్షం కారణంగా మ్యాచ్ పూర్తిగా సాగడం లేదు. ఇంకా 244 పరుగులు వెనుకంజలో భారత్ ఉంది. చివరి సెషన్ కూడా ఎలాంటి ఇబ్బందిలేకుండా జరగడం కష్టమే. ఇలాంటి సమయంలో భారత్ ఆలౌట్ కాకుండా ఉంటే.. మ్యాచ్‌ను డ్రా దిశగా తీసుకెళ్లే అవకాశం ఉంటుంది.



పట్టుదలగా ఆడిన నితీశ్

కీలక ఇన్నింగ్స్ ఆడిన కేఎల్ రాహుల్ (84) ఔటైన తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన తెలుగు కుర్రాడు నితీశ్‌కుమార్ రెడ్డి (16: 61 బంతుల్లో) పోరాటపటిమ చూపించాడు. స్టార్క్, నాథన్, కమిన్స్ ఊరించే బంతులను విసిరినా ఏమాత్రం ఏకాగ్రత కోల్పోలేదు. సీనియర్ బ్యాటర్లు ఇబ్బంది పడిన పిచ్‌పై నితీశ్ పట్టుదల ప్రదర్శించాడు. రవీంద్ర జడేజాకు అండగా నిలిచాడు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు 53 పరుగులు జోడించారు. అయితే, కమిన్స్ వేసిన బంతిని అంచనా వేయడంలో కాస్త తడబాటుకు గురైన నితీశ్ బౌల్డయ్యాడు. దీంతో జడ్డూ తప్ప ప్రధాన బ్యాటర్లంతా పెవిలియన్‌కు చేరినట్లైంది.

## ఆదుకున్న టెయిలెండర్స్.. గట్టెక్కిన టీమిండియా!

ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడో టెస్ట్‌లో టీమిండియా ఓటమిని తప్పించుకుంది. టెయిలెండర్స్ జస్‌ప్రీత్ బుమ్రా(27 బంతుల్లో సిక్స్‌తో 10 బ్యాటింగ్), ఆకాశ్ దీప్(31 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 27 బ్యాటింగ్) అసాధారణ బ్యాటింగ్‌తో టీమిండియాను ఫాలో ఆన్ గండం నుంచి గట్టెక్కించారు. ఆఖరి వికెట్‌కు అజేయంగా 39 పరుగులు జోడించారు. వెలుతురు లేమితో అంపైర్లు నాలుగో రోజు ఆటను ముందుగానే ముగించారు. మ్యాచ్ ఆగిపోయే సమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 74.5 ఓవర్లలో 9 వికెట్లకు 252 పరుగులు చేసింది.

తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 445 పరుగులు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం భారత్ ఇంకా 193 పరుగుల వెనుకంజలో ఉంది. బుధవారం చివరి రోజు కావడంతో ఈ మ్యాచ్ డ్రా అయ్యే అవకాశాలు ఉన్నాయి. 51/4 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన భారత్‌కు ఆదిలోనే అదృష్టం కలిసొచ్చింది.

తొలి బంతికే కేఎల్ రాహుల్ ఇచ్చిన క్యాచ్‌ను స్లిప్‌లో స్మిత్ నేలపాలు చేశాడు. 35 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద లభించిన ఈ అవకాశాన్ని రాహుల్ సద్వినియోగం చేసుకున్నాడు. ఆ కాసేపటికే కెప్టెన్ రోహిత్ శర్మ(10)ను కమిన్స్ కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి వచ్చిన జడేజా సాయంతో కేఎల్ రాహుల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో రాహుల్ 85 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ ఇద్దరూ ఆచితూచి ఆడటంతో భారత్ 167/6 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది.

లంచ్ బ్రేక్ అనంతరం కాసేపు వర్షం అంతరాయం కలిగించింది.



ఆట తిరిగి ప్రారంభమవ్వగా.. స్మిత్ స్టన్నింగ్ క్యాచ్‌కు కేఎల్ రాహుల్ వెనుదిరిగాడు. క్రీజులోకి వచ్చిన నితీష్ కుమార్ రెడ్డితో జడేజా పోరాడాడు. 82 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న అతను.. భారత జట్టుకు ఫాలో ఆన్ గండం గట్టెక్కించే ప్రయత్నం చేశాడు.

నితీష్ కుమార్ రెడ్డి ఔటైనా.. సిరాజ్‌తో కలిసి జట్టు స్కోర్‌ను 200 పరుగుల మార్క్‌ను ధాటించాడు. 201/7 స్కోర్ టీమిండియా టీ బ్రేక్‌కు వెళ్లగా.. మూడో సెషన్ ప్రారంభంలోనే సిరాజ్‌ను మిచెల్ స్టార్క్ ఔట్ చేశాడు. ఆ కాసేపటికే జడేజా కూడా కమిన్స్ బౌలింగ్‌లో వెనుదిరిగడంతో భారత్ ఫాలో ఆన్ ఆడటం తప్పదని అంతా అనుకున్నారు. కానీ బుమ్రా-ఆకాశ్ దీప్ అసాధారణ బ్యాటింగ్‌తో టీమిండియాను ఆదుకున్నారు. కీలక భాగస్వామ్యంతో ఫాలో ఆన్ గండాన్ని గట్టెక్కించడంతో పాటు ఓటమిని తప్పించారు.

## భారత్‌కు తప్పిన 'ఫాలో ఆన్' గండం.. ఆదుకొన్న టెయిలెండర్లు

మేం ఎవరికీ తక్కువ కాదంటూ నిలకడగా ఒక్కో పరుగు రాబట్టారు. అవసరమైనప్పుడు దూకుడు ప్రదర్శించి బౌండరీలూ బాదారు. ఇప్పటికే అర్థమైందిగా ఆ జోడీ ఎవరని?.. వారే జస్‌ప్రీత్ బుమ్రా - ఆకాశ్ దీప్. స్టార్ బ్యాటర్లకే సాధ్యం కానివిధంగా పోరాడి జట్టును 'ఫాలో ఆన్' గండం నుంచి బయటపడేశారీ పేస్ బౌలర్లు కమ్ బ్యాటర్లు.

నా బ్యాటింగ్ గురించి గూగుల్‌లో చూడు

ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడో టెస్టులో భారత్ 'ఫాలో ఆన్'ను తప్పించుకుంది. టెయిలెండర్లు జస్‌ప్రీత్ బుమ్రా (10ి), ఆకాశ్ దీప్ (27ి) పదో వికెట్‌కు 39 పరుగులు జోడించారు. ఆట ముగిసే ముందు చివర్లో ఆకాశ్ దీప్ కొట్టిన సిక్స్ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. అయితే, వెలుతురు లేమి కారణంగా అంపైర్లు మ్యాచ్‌ను కాస్త ముందుగానే నిలిపేశారు. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ తొమ్మిది వికెట్ల నష్టానికి 252 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 445 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. టీమ్‌ఇండియా ఇంకా 193 పరుగుల వెనుకంజలో ఉంది. 'ఫాలో ఆన్' నుంచి బయటపడంతో టీమ్‌ఇండియా శిబిరంలో జోష్ వచ్చింది.

జడ్డూ - కేఎల్ కీలక ఇన్నింగ్స్‌లు

ఓవర్‌నైట్ 51/4 స్కోరుతో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన భారత్‌కు కాసేపటికే షాక్ తగిలింది. ఆఫ్ సైడ్ బంతిని కదిలించి మరీ కెప్టెన్ రోహిత్ శర్మ (10) పెవిలియన్‌కు చేరాడు. ఆ తర్వాత కేఎల్ రాహుల్ (84), రవీంద్ర జడేజా (77) కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లారు. ఆరో వికెట్‌కు 67 పరుగులు జోడించారు. ఈ క్రమంలో కేఎల్ సెంచరీ దిశగా సాగినట్లు అనిపించాడు. కానీ, నాథన్ లైయన్ బౌలింగ్‌లో స్టీవ్ స్మిత్ స్లిప్‌లో అద్భుతమైన క్యాచ్ పట్టాడు. అంతకుముందు 33 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద స్మిత్ క్యాచ్‌ను వదిలాడు.

కేఎల్ ఔటైన తర్వాత బ్యాటింగ్‌కు దిగిన నితీశ్ కుమార్ రెడ్డి (16)తో కలిసి జడేజా ఏడో వికెట్‌కు 53 పరుగులు జోడించాడు. పాట్ కమిన్స్ బౌలింగ్‌లో నితీశ్ బౌల్డ్ అయి పెవిలియన్‌కు చేరాడు. ఆ తర్వాత దూకుడు పెంచే క్రమంలో జడేజా కూడా ఔటయ్యాడు. ఇక ఫాలో ఆన్ తప్పదని భావించిన వేళ.. బుమ్రా - ఆకాశ్ దీప్ జోడీ విలువైన



పరుగులు రాబట్టారు. చివరికి నాలుగో రోజే ఆలౌట్ కాకుండా ఆటను ముగించారు. భారత క్రికెటర్లలో యశస్వి జైస్వాల్ (4), శుభ్‌మన్ గిల్ (1), విరాట్ కోహ్లీ (3), రిషభ్ పంత్ (9), సిరాజ్ (1) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. రోహిత్ శర్మ 10, నితీశ్‌కుమార్ రెడ్డి 16 పరుగులు చేశారు. ఆసీస్ బౌలర్లలో పాట్ కమిన్స్ 4, మిచెల్ స్టార్క్ 3.. జోష్ హేజిల్‌వుడ్, నాథన్ లైయన్ చెరో వికెట్ తీశారు.

జోష్ హేజిల్‌వుడ్ దూరం..

నాలుగో రోజు కేవలం ఒక్క ఓవర్ మాత్రమే వేసిన జోష్ హేజిల్‌వుడ్ గాయం కారణంగా మళ్లీ మైదానంలోకి దిగలేదు. అతడికి వైద్య పరీక్షలు నిర్వహించిన క్రికెట్ ఆస్ట్రేలియా మ్యాచ్‌కు అందుబాటులో ఉండటం కష్టమేనని పేర్కొంది. సిరీస్‌లోని మిగతా రెండు మ్యాచుల్లోనూ ఆడే అవకాశాలు తక్కువేనని వెల్లడించింది. జట్టులో మార్పులు ఉంటే త్వరలోనే ప్రకటిస్తామని తెలిపింది. జోష్‌కు బదులు రెండో టెస్టులో ఆడిన స్కాట్ బోలాండ్‌కు తుది జట్టులోకి మళ్లీ పిలుపు వచ్చే అవకాశం ఉంది. ఒకవేళ భారత్ ఫాలో ఆన్‌ను ఎదుర్కొన్నా.. ఆసీస్ మాత్రం మళ్లీ బౌలింగ్ వేసేందుకు మొగ్గు చూపేది కాదని క్రికెట్ పండితుల విశ్లేషణ. హేజిల్‌వుడ్ గైర్హాజరీతో బౌలింగ్ పేస్ భారం కమిన్స్, స్టార్క్‌పైనే పడింది. మిచెల్ మార్ష్ ఉన్నప్పటికీ.. అతడు ఎక్కువగా బౌలింగ్ చేయలేదు. ఇప్పుడు భారత్ 'ఫాలో ఆన్' గండం నుంచి బయటపడింది.

## రోహిత్, కోహ్లీలను నేను తిట్టలేదు: అనిల్ కుంబ్లే

టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీలను తాను విమర్శించినట్లు సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ప్రచారం అవాస్తవమని దిగ్గజ స్పిన్నర్ అనిల్ కుంబ్లే అన్నాడు. తాను ఎవరినీ విమర్శించలేదని స్పష్టం చేశాడు. ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియాతో గబ్బా వేదికగా జరుగుతున్న మూడో టెస్ట్‌లో టీమిండియా తడబడుతోంది. దాంతో రోహిత్ శర్మ కెప్టెన్సీ, విరాట్ కోహ్లీ బ్యాటింగ్‌పై అనిల్ కుంబ్లే ఘాటు వ్యాఖ్యలు చేసినట్లు సోషల్ మీడియా వేదికగా జోరుగా ప్రచారం జరుగుతోంది. రోహిత్ శర్మ కెప్టెన్సీ తనకు అర్థం కావడం లేదని, ట్రావిస్ హెడ్‌ను ఔట్ చేసే ప్రణాళికలు లేకపోవడం ఏంటని కుంబ్లే అన్నట్లు కొందరు ఆకతాయిలు ఫేక్ పోస్ట్‌లు సృష్టించారు. అంతేకాకుండా తొలి ఇన్నింగ్స్‌లో విరాట్ కోహ్లీ విఫలమైన అనంతరం.. కుంబ్లే ఘాటు వ్యాఖ్యలు చేశారని అసత్య ప్రచారం చేశారు. గత ఐదేళ్లుగా కోహ్లీ సరిగ్గా ఆడటం లేదని, అతన్ని ఎవరూ ప్రశ్నించడం లేదని కుంబ్లే మండిపడినట్లు పోస్ట్‌లు క్రియేట్ చేశారు. కోహ్లీ లగేజీ సర్దుకొని లండన్ సెటిల్ అవ్వడం ఉత్తమమని కుంబ్లే అన్నట్లు ప్రచారం జరిగింది. అయితే ఈ నకిలీ వార్తలపై కుంబ్లే స్పందించాడు. వాటితో తనకు ఎలాంటి సంబంధం లేదని ఎక్స్‌వేదికగా స్పష్టం చేశాడు. 'కొన్ని సోషల్ మీడియా ఖాతాలు



నా ఫొటోను ఉపయోగిస్తూ నేను అనని మాటలు అన్నట్లు ఫేక్ పోస్ట్‌లు సృష్టించాయి. అవి నా దృష్టికి వచ్చాయి. ఆ ఖాతాలు.. వాటిలో సమాచారంతో నాకు ఎలాంటి సంబంధం లేదు. ఆ వ్యాఖ్యలు నేను చేయలేదు. ఇలాంటి వాటి విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలి. సోషల్ మీడియా వచ్చే ప్రతీదాన్ని నమ్మొద్దు. ఏదైనా సమాచారాన్ని షేర్ చేసే ముందు అది సరైనదో కాదో క్రాస్ చెక్ చేసుకోవాలి. నా అధికారిక సోషల్ మీడియా ఖాతాల నుంచి వచ్చే సమాచారాన్ని మాత్రమే నమ్మండి.'అని కుంబ్లే ఎక్స్ వేదికగా అభిమానులను కోరాడు.

## ఆకాష్ బౌండరీ కొట్టగానే సెలబ్రేట్ చేసుకున్న గంభీర్..!

భారత్ ను ఫాలో-ఆన్ గండం నుంచి జస్ప్రీత్ బుమ్రా, ఆకాష్ దీప్ గట్టేంకించారు. జస్ప్రీత్ బుమ్రా, ఆకాష్ దీప్ 10వ వికెట్ మంచి భాగస్వామ్యాన్ని నమోదు చేశాడు.

వీరిద్దరి వీరోచిత పోరాటంతో భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ వేడుకలు జరుపుకున్నాడు. ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమ్మిన్స్ బౌలింగ్ లో ఆకాష్ దీప్ బౌండరీ కొట్టగా ఇండియా ఫాలో ఆన్ తప్పించుకుంది. దీంతో గంభీర్, కోహ్లీ సెలబ్రేషన్స్ చేసుకున్నారు. హైపై ఇచ్చుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కెప్టెన్ రోహిత్ శర్మ కూడా ఆనందంలో ఉన్నట్లు కనిపించాడు.

కమ్మింగ్స్ స్టంప్‌పై బాల్ వేయడంతో దాన్ని ఆకాష్ దీప్ డీప్ మిడ్ వికెట్ మీదుగా ఫోర్ కొట్టాడు. ఆ తర్వాత బ్యాడ్ లైట్ కారణంగా అంపైర్లు ఆటను ముగించేశారు. ఆకాశ్ దీప్ 31 బంతుల్లో 27 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మరో ఎండ్‌లో బుమ్రా 27 బంతుల్లో 10 పరుగులు చేశాడు. ఆస్ట్రేలియా బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్



చేసినా వీరిద్దరు వికెట్ ఇవ్వలేదు. 4వ రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 74.5 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 252 పరుగులు చేసింది. ఇండియా 193 పరుగులు వెనుకబడి ఉంది. ఐదో రోజు టీమిండియా అలౌట్ అయితే ఆస్ట్రేలియా బ్యాటింగ్ చేస్తోంది.

## టెస్ట్ క్రికెట్‌కు రోహిత్ శర్మ గుడ్ బై?

ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా గబ్బా వేదికగా జరుగుతున్న మూడో టెస్ట్‌లోనూ రోహిత్ శర్మ(10) దారుణంగా విఫలమయ్యాడు.

ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ బౌలింగ్‌లో రోహిత్ కీపర్ క్యాచ్‌గా వెనుదిరిగాడు. గుడ్ లెంగ్త్ బాల్‌ను డ్రైవ్ షాట్ ఆడే ప్రయత్నం చేసి మూల్యం చెల్లించుకున్నాడు. కేఎల్ రాహుల్ కోసం నెంబర్ 6లో బ్యాటింగ్‌కు వచ్చిన రోహిత్.. ఎదుర్కొన్న తొలి బంతి నుంచే చాలా అసౌకర్యంగా కనిపించాడు. ముఖ్యంగా అతని ఫుట్‌వర్క్ చాలా పేలవంగా కనిపించింది. బంతి వచ్చేవరకు ఎదురు చూసేంత ఓపిక అతని ఆటలో కనిపించలేదు. క్రీజులో ఏ మాత్రం కదలకుండా షాట్ ఆడి మూల్యం చెల్లించుకున్నాడు.

డగౌట్ వద్దే గ్లౌజ్‌లు..

దాంతో తీవ్ర అసంతృప్తికి గురైన రోహిత్ శర్మ తన గ్లౌజ్‌లను డగౌట్ వద్దే పడేసి డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లాడు. ఈ ఘటన అందర్నీ షాక్‌కు గురి చేసింది. వరుసగా విఫలమవుతుండటంతో రోహిత్ భావోద్వేగపూరితమైన నిర్ణయం తీసుకున్నాడా? అనే చర్చ మొదలైంది. గబ్బా టెస్ట్ ముగిసిన తర్వాత సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలుకుతాడనే ఊహాగానాలు తెరపైకి వచ్చాయి.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**